



T/TG/2024/0523/7229/1544


# ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక




పబ్లిష్ : తెలంగాణ బుధవారం 18 -06-2025 సంపుటి : 01 సంచిక :189 ఎడిటర్ : పెనుగొండ సతీష్ పేజీలు : 08 వెల : 05 రూ /-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham,nijambad, rajana sirisilla



# రైతు భరోసా
# రైతులకు డబుల్ ధమాకా

**గతంలో రబీ సీజన్ రైతు భరోసా అందక ఇబ్బంది పడిన రైతులు, వాటి కోసమే ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు**

- తెలంగాణలో ఖరీఫ్ రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి
- రైతు భరోసా కార్యక్రమం కింద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి నిధులు
- గత రబీ సీజన్‌లో నాలుగు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకే రైతు భరోసా మొత్తం చేరింది

తెలంగాణ ఆకాంక్ష : తెలంగాణలో ఖరీఫ్ రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. అయితే.. రబీ సీజన్ సమయంలో నాలుగు ఎకరాలకు మించి భూమి ఉన్న రైతులకు ఇప్పటికీ డబ్బులు అందలేదు. రాష్ట్ర మంత్రులు గతంలో ఆర్థిక సమస్యల కారణంగా ఆలస్యం అని హామీ ఇచ్చినా.. బకాయిలు చేరలేదు. ఇప్పుడు ఖరీఫ్ నిధులు జమ అవుతుండగా, రబీ డబ్బుల పై స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. రెండు సీజన్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ రైతులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా

మిగతాది 2 లో...

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

**ఆపరేషన్‌లో ఆదివాసీలే హతమవుతున్నారు**

**ఇది ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధం**

**మావోలతో వెంటనే శాంతి చర్చలు జరపాలి**

**ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాలో మేధావుల పిలుపు**



హైదరాబాద్,జూన్ 17(ఆకాంక్ష ): ఆపరేషన్ కగార్‌కు నిరసనగా ఇందిరాపార్కు వద్ద అఖిల పక్షాలు మహాధర్నా చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను ఎత్తివేయాలని పలువురు ఈ మహాధర్నాలో డిమాండ్ చేశారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, తమ్మినేని వీరభద్రం, నారాయణమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌లో ఎక్కువ మంది ఆదివాసీలే చనిపోతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతియుత చర్చలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ తమ పార్టీ దృష్టిలో ఆపరేషన్ కార్పొరేట్ కబ్జా అని.. మానవత్వానికి ఇది ఒక మచ్చ అని భారాస నేత దాసోజు శ్రావణ్ విమర్శించారు. అణచివేయాల్సింది మావోయిస్టులను కాదు..

మిగతాది 2 లో...

# గత ప్రభుత్వ హయాంలో ఫోన్ల ట్యాప్

**మా ఫెన్ ట్యాప్ జరిగందనే అనుమానం**

**కెసిఆర్,కెటిఆర్‌లు సిగ్గుతో తలదించుకోవాలి**

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**



హైదరాబాద్,జూన్ 17(ఆకాంక్ష ): గత ప్రభుత్వం తమ ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు అనుమానం రావడంతోనే సీఎస్‌కు ఫిర్యాదు చేసినట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు ఆయన హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా ఆయన తన వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ

మిగతాది 2 లో...

# యోగాతో ప్రపంచ ఐక్యతా స్ఫూర్తి

**యోగా సందేశంలో ప్రధాని మోడీ**



న్యూఢిల్లీ,జూన్ 17(ఆకాంక్ష ): యోగా అనేది కేవలం వ్యక్తిగత ఆరోగ్యం గురించి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ ఐక్యతా స్ఫూర్తిని నెలకొల్పడానికి కూడా తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను ప్రధాని విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించుకోబోతున్నాం. గత పదేళ్లుగా యోగా కేవలం భారతదేశంలోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ చేరువై వారి జీవితాల్లో సానుకూల ప్రభావం చూపుతోంది. అది మనందరికీ గర్వకారణం. ఈ ఏడాది విశాఖపట్నం కేంద్రంగా జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా.. ఒక భూమి.. ఒక ఆరోగ్యం..' అనే థీమ్‌తో జరుపుకోబోతున్నాం' అని ప్రధాని పేర్కొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్న బిఆర్ఎస్

- పదేళ్ల అధికారంలో ఉండగా అప్పలు చేసి పోయారు
- చిత కరెంట్ అప్పలు కూడా నెత్తిన వేశారు
- డిమాండ్‌కు తగ్గకుండా విద్యుత్ సరఫరా చేశాం
- భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి పథకాలకు భట్టి శ్రీకారం
- సౌర ఇద్యుత్ ప్రాజెక్టుల్లో మహిళలకు భాగస్వామ్యం: శ్రీధర్ బాబు

మిగతాది 2 లో...

జయశంకర్ భూపాలపల్లి,జూన్ 17(ఆకాంక్ష ): రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే బిఆర్ఎస్ పార్టీ ఓర్వలేకపోతుందని ఉప ముఖ్యమంత్రి

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు

**ఒకేరోజు 600మంది ఫోన్ల ట్యాప్**

**నక్సల్స్ సానుభూతిపరుల పేరుతో ట్యాప్**

**జాబితాలో రేవంత్, ఈటెల, అరవింద్ , రఘునందన్ రావు**

**మరోమారు విచారణకు హాజరైన ప్రభాకర్ రావు**



హైదరాబాద్,జూన్ 17(ఆకాంక్ష ): ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్న తరుణంలో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు మరోసారి సిట్ విచారణకు హాజరయ్యారు. నాలుగో సారి సిట్ ముందు హాజరైన ఆయనను మరింత లోతుగా

మిగతాది 2 లో...

# 42శాతం బిసి రిజర్వేషన్లు సాధిస్తాం:అంతవరకు విశ్రమించేది లేదు

**రౌంట్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత**



మెదక్,జూన్ 17(ఆకాంక్ష ): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు సాధించుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. బీసీలంతా చైతన్యం కావాలని కోరారు. కామారెడ్డిలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్ సాధించే వరకు పోరాడుతామని అన్నారు. మంగళవారం మెదక్ జిల్లాలో కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్దంగా 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇది రాజకీయ వేదిక కాదు.. మానవ హక్కుల వేదిక అని చెప్పారు. విద్యకు, ఉద్యోగాలకు, రాజకీయాలకు వేర్వేరుగా రేవంత్ ప్రభుత్వం రిజర్వేషన్ బిల్లులు పెట్టాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. ఢిల్లీకి బీసీ రిజర్వేషన్

మిగతాది 2 లో...

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలన విషయాలు

విచారించేందుకు సిట్ ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటికే 600 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో వారు ఇబ్బందులకు గురైన తీరును వివరించి.. దానిపై ప్రభాకర్‌రావు ఏం చెబుతారనే విషయాన్ని నమోదు చేయనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సాధారణ ఎన్నికల సమయంలో నవంబర్ 15న పెద్ద ఎత్తున ట్యాపింగ్ జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నవంబర్ 15న 600 మంది ఫోన్లను ప్రభాకర్ రావు టీమ్ ట్యాప్ చేసినట్లు గుర్తించారు. సాధారణ ఎన్నికల సమయంలో ప్రణీత అండ్ టీమ్ పెద్ద ఎత్తున ట్యాపింగ్‌కు పాల్పడినట్లు బయటపడింది. ఒకే రోజు 600 ఫోన్‌లను ప్రభాకర్ రావు ట్యాప్ చేశారు. మావోయిస్టుల పేరు చెప్పి ట్యాపింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మావోయిస్టులకు సహకారం అందిస్తున్నారని మావోయిస్టుల సానుభూతిపరుల పేర్లతో ట్యాపింగ్ చేసినట్లు గుర్తించారు. రివ్యూ కమిటీకి మావోయిస్టుల పేర్ల మీద నెంబర్లను ప్రభాకర్ రావు ఇచ్చినట్లు తేలింది. సాధారణ ఎన్నికల్లో మావోయిస్టులు యాక్టివ్ అయ్యారని కమిటీకి ప్రభాకర్ రావు చెప్పినట్లు సమాచారం. మావోయిస్టుల పేరుతో అధికార, ప్రతిపక్ష, వ్యాపార రంగానికి చెందిన వారితో పాటు జర్నలిస్టుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. ప్రతిపక్ష కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు కీలక నాయకుల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. రేవంత్ రెడ్డి, ఈటెల రాజేందర్, అరవింద్ , రఘునందన్ రావు ఫోన్‌లను ట్యాప్ చేసినట్లు గుర్తించారు. అప్పటి బీఆర్ఎస్ అధికారపక్ష నాయకులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారు. ట్యాపింగ్ కోసం ప్రభాకర్ రావు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. శ్రవణ్ రావు ద్వారా సమాచారం తెప్పించుకొని ప్రణీతరావుకు ప్రభాకర్ రావు ఇచ్చేవారని తేలింది. ట్యాపింగ్ ద్వారా వచ్చిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు భుజంగరావుకు ప్రణీత్ ఇచ్చారని... భుజంగరావు నేరుగా బీఆర్ఎస్ నేతలకు ఫోన్ చేసి స్థితిగతులను ఎప్పటికప్పుడు వివరించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రతిపక్ష నాయకుల వైపు ఎవరైనా వెళ్తుంటే వెంటనే అధికారపక్ష నేతలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు భుజంగరావు. ప్రతిపక్ష పార్టీలకు ఆర్థిక సాయం చేస్తున్న వారిపై నిఘా పెట్టి పోలీసులతో దాడులు చేయించారు. వ్యాపారవేత్తలపై దాడుల కోసం టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ రాధా కిషన్ రావును ప్రభాకర్ రావు ఉపయోగించుకున్నట్లు సమాచారం. డబ్బులు ఎవరైనా తీసుకువెళ్తుంటే వెంటనే ట్యాప్ చేసి మరీ అధికారులు పట్టుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

## 42శాతం బిసి రిజర్వేషన్లు సాధిస్తాం

బిల్లు పంపామని తమకు ఏం సంబంధం లేదనేలా కాంగ్రెస్ నేతలు అనడం సరికాదని చెప్పారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఒక్కరోజైనా బీసీ బిల్లు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో మాట్లాడారా అని ప్రశ్నించారు. బీసీ బిల్లు వస్తే ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు, నిధులు వస్తాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనలో చిత్తశుద్ధి లేదని తెలిపారు ఎమ్మెల్సీ కవిత. బీసీ బిల్లు సాధనకు కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు. బీసీ బిల్లు ఆమోదం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావడానికి జులై 17వ తేదీన రైల్‌రోకో చేపడతామని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల అంశం తేలకుండా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు పెడతామనడం సరికాదని అన్నారు. బీసీలకు రిజర్వేషన్‌లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే ఆపుతామని చెప్పారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడితే బీసీ బిడ్డల కాళ్ల వద్దకు పదవులు వస్తాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఇదిలావుంటే కవిత పర్యటనకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సునీతా మహేందర్ రెడ్డిలు దూరంగా ఉన్నారు.

## రైతు భరోసా ఆ రైతులకు డబుల్ ధమాకా

కార్యక్రమం కింద ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి నిధులు సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి వీటిని లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే.. గత రబీ సీజన్‌కు సంబంధించి.. పలు ప్రాంతాల్లోని చాలా మంది రైతులకు, ముఖ్యంగా నాలుగు ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారికి ఇప్పటికీ నిధులు చేరలేదు. అప్పటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆలస్యం జరుగుతుందని.. అందరికీ సహాయం అందుతుందని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు గతంలో హామీ ఇచ్చినా.. రబీ బకాయిలు ఇప్పటికీ జమ కాకపోవడంతో సదరు రైతులు తీవ్ర అయోమయంలో ఉన్నారు. తమకు ఇక ఈ సాయం రానట్టేనా అని లోలోపల చర్చించుకుంటున్నారు.

### రబీ బకాయిల సమస్య..

గత రబీ సీజన్‌లో.. పైలట్ గ్రామాలలో మినహా.. పలు చోట్ల నాలుగు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకే రైతు భరోసా మొత్తం చేరింది. ఆ పైన భూమి ఉన్న మిగిలిన అన్నదాతలకు ఆనాటి సాయం అందని పరిస్థితి నెలకొంది. ఎన్నికల హామీలో భాగంగా ఎటువంటి పరిమితులు లేకుండా అందరికీ రైతు భరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. ఆర్థిక కారణాల వల్ల కొంతమందికి రాలేదు. అప్పటి నిధులు పూర్తి స్థాయిలో అందకముందే, ఇప్పుడు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసాను విడుదల చేయడంతో.. గతంలో బకాయిలున్న రైతుల్లో ఆందోళన ఎక్కువైంది. ఈసారైనా తమకు పూర్తిగా నిధులు అందుతాయా లేదా అనే సందేహంలో ఉన్నారు. ఒకవేళ స్థానిక ఎన్నికల నేపథ్యంలో కేవలం ఖరీఫ్ సీజన్ డబ్బులు మాత్రమే జమ చేసి.. రబీ సీజన్ బకాయిలు ఇక రావని సంకేతాలు వస్తే.. అది తమకు పెద్ద అన్యాయమని నాలుగు ఎకరాల పైన భూమి ఉన్న రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు రైతులు, 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. నాలుగు ఎకరాలలోపు ఉన్న వారికి రబీ, ఖరీఫ్ రెండు సీజన్లకు (డబుల్ ధమాకా) నిధులు అందినందుకు కొంతమంది మిగతా వారిని వ్యంగ్యంగా చూస్తున్నారు. రెండుసార్లు రైతు భరోసా పొందిన వారిని చూసి, ఒక్కసారి మాత్రమే సాయం అందిన రైతులు కూడా తమకు అప్పటి రబీ, ఇప్పటి ఖరీఫ్ రెండు సీజన్ల డబ్బులు రావాలని కోరుకుంటున్నారు.

### ప్రభుత్వంపై పెరుగుతున్న ఒత్తిడి..

గతంలో రబీ సీజన్ రైతు భరోసా అందక ఇబ్బంది పడిన రైతులు, వాటి కోసమే ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. వారి ఆశలను తీర్చకుండానే మళ్లీ ఖరీఫ్ సీజన్ నిధులు ఖాతాల్లోకి వేయడం ప్రారంభించడం వారికి మరింత అయోమయాన్ని పెంచింది. ఈ సమస్యపై స్పష్టత ఇవ్వాలని.. అప్పుడు రైతు భరోసా రానీ నాలుగు ఎకరాల పైబడిన రైతులకు ఖరీఫ్, రబీ రెండు సీజన్లకు సంబంధించి నిధులు జమ చేయాలని ముధోల్ తాలూకా బీఆర్ఎస్ సమన్వయ నాయకులు కిరణ్ కొమ్రేవార్ ప్రభుత్వాన్ని కోరారు.

### రైతు భరోసా డబ్బులు వచ్చేశాయ్.. అకౌంట్స్ చెక్ చేసుకోండి..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో... ప్రభుత్వం రైతుల మధ్య ఉన్న ఈ అసంతృప్తిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అన్ని వర్గాల రైతులకు న్యాయం చేసి, వారికి పూర్తి ఆర్థిక భరోసా కల్పించడం ద్వారానే ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలరు. రైతు భరోసా పథకం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.. అన్నదాతలను అప్పుల ఊబి నుంచి బయటపడవేయడం, వ్యవసాయ పెట్టుబడికి సాయం అందించడం. ఈ లక్ష్యం నెరవేరాలంటే.. పథకం అమలులో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని రైతులు, ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి... రబీ బకాయిలపై స్పష్టమైన ప్రకటన చేసి, అర్హులైన ప్రతి రైతుకు నిధులు అందేలా చూడాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. ఈ సారి ఎకరాలతో సంబంధం లేకుండా.. అందరికీ రైతు భరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో నేటి వరకు 3 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో ఖరీఫ్ సీజన్ నిధులు జమ అయ్యాయి. రేపటి నుంచి 4 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.





# గత ప్రభుత్వ హయాంలో ఫోన్ల ట్యాప్

మా ఫోన్లను ట్యాప్ చేశారు. రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య. ఈ చర్యకు పాల్పడిన కేసీఆర్, కేటీఆర్ సిగ్గుతో తలవంచుకోవాలి. రాజకీయాల్లో భారాస నేతలే ఉండాలనే దురుద్దేశంతో మా ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో కాంగ్రెస్ ఓడిపోవడానికి ఫోన్ల ట్యాపింగే కారణమని తెలుస్తోంది. రేవంత్ రెడ్డితో పాటు నా ఫోన్ కూడా ట్యాప్ చేసి మా కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఇదే ఫిర్యాదును గతంలోనూ చేశాను. ఇవాళ వాస్తవాలు బయటకు వచ్చాయి. చట్టానికి వ్యతిరేకంగా అనేకమంది ఫోన్లను ట్యాప్ చేశారు. 2022 నుంచి సీనియర్ కాంగ్రెస్ నాయకుల ఫోన్లు ట్యాపింగ్‌లో ఉన్నాయి. సిట్ దర్యాప్తులో 650 మంది కాంగ్రెస్ నాయకుల పేర్లు జాబితాలో ఉన్నాయని తెలిసిందన్నారు. 'కుంభం అనిల్ కుమార్ యాదవ్, గాలి అనిల్‌తోపాటు అనేకమంది ఫోన్లు ట్యాప్ అయినట్లు బయటికి వచ్చింది. ఇవన్నీ చూస్తుంటే, నాడు ఏ రకంగా అధికారాన్ని దుర్వినియోగం చేసి దుశ్చర్యకు పాల్పడ్డారో అర్థమవుతోంది. ప్రజాస్వామ్యంలో నిక్కచ్చిగా పనిచేయాల్సిన అధికారులు.. రాజకీయ నాయకులకు తలొగ్గి అడుగులకు మడుగులొత్తారు. ప్రైవసీ అనేది మా ప్రాథమిక హక్కు. దానిని కాలరాశారు. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పెట్టారు. నక్సలైట్లకు సానుభూతిపరులుగా ఉన్నారని మమ్మల్ని ట్యాప్ చేయడం సిగ్గుచేటు. కేటీఆర్ సిగ్గుతో తల దించుకోవాలి' 'ఆనాడు మా ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయత్నం చేశారు. దానికి మీరు శిక్షార్హులు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడకుండా ఉండాలంటే వీరికి శిక్ష పడాల్సిందే. ఇలాంటి దిగజారుడు పనికి ఒడిగట్టిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు కూడా శిక్ష పడాలి. సజావుగా విచారణ జరిపి... రాజకీయ నాయకులైనా, అధికారులైనా... బాధ్యులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో (ఖఠనీని ఃజూతినిణ అజీబ।) సిట్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ కేసులో బాధితుల నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసే ప్రక్రియను సిట్ మొదలుపెట్టింది. ఇప్పటికే కొంతమంది బాధితుల స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసిన సిట్.. తాజాగా ఈ కేసులో సాక్షిగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వాంగ్మూలాన్ని రికార్డు చేయాలని నిర్ణయించి.. ఆయనకు సమాచారం అందించారు. ఇందులో భాగంగా మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు మహేష్ కుమార్ చేరుకున్నారు. దీంతో జూబ్లీహిల్స్ పీఎస్ ముందు కాంగ్రెస్ కార్యకర్తల హడావిడి నెలకొంది. సిట్ కార్యాలయానికి పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లేందుకు యత్నించిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని బయటకు పంపించి వేశారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. కాగా.. ప్రస్తుతం టీపీసీసీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న మహేష్ కుమార్.. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆ సమయంలో తన ఫోన్‌ను ట్యాప్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ప్రణీత్ రావును అరెస్ట్ చేసి ఆయనకు సంబంధించి ఫోన్లను రికవరీ చేసిన సమయంలో అందులోని డేటాను విశ్లేషించగా.. మహేష్ కుమార్ గౌడ్‌కు చెందిన అంశాలు బయటపడ్డాయి. దీంతో ఆయన ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో మహేష్ కుమార్‌ను బాధితుడిగా భావించి ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేయాలని నిర్ణయించారు.

# ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

దోపిడీనని ఈ ధర్నాలో పాల్గొన్న సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణ మూర్తి అన్నారు. మావోయిస్టులను చంపడం కాదు.. జల్, జంగిల్, జమీన్ నినాదానికి పరిష్కారం చూపించాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు కోరారు. ఆదివాసీ, పౌర సంఘాలతో భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపాలన్నారు. శాంతి చర్చలు జరపకపోవడం వల్లే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం నెలకొందని చెప్పారు. 'మావోయిస్టులతో చర్చలు జరపాలని మేం అంటే.. మమ్మల్ని మావోయిస్టులు అంటున్నారు. మేం మావోయిస్టులు అయితే మైకులు ఎందుకు పట్టుకుంటాం.. తుపాకులు పట్టుకునే వాళ్లం'అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ సమస్యనైనా చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రాజ్యాంగం చెబుతోందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. నక్సలైట్లు చర్చలకు సిద్ధంగా ఉంటే.. ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. రాజశేఖర్‌రెడ్డి హయాంలో మావోయిస్టులతో చర్చలు జరిపారని, మోదీ ప్రభుత్వం మాత్రం మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నా చంపేస్తోందని విమర్శించారు. మావోయిస్టులను చంపడం తాత్కాలిక ఉపశమనమేనని శాశ్వత పరిష్కారం కాదన్నారు. శాంతిచర్చలు జరిపితే పరిష్కారం దొరుకుతుందని మోదీ, అమిత్‌షా గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగానికి లోబడి ఉందన్నారు. అడవుల్లోని ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకే అమిత్ షా .. నక్సలైట్ రహిత దేశంగా చేస్తామంటున్నారని నటుడు ఆర్ నారాయణ మూర్తి ఫైర్ అయ్యారు పాకిస్తాన్ తో చర్చలు జరిపిన కేంద్రం.. భరత మాత ముద్దు బిడ్డలైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపడం లేదని ప్రశ్నించారు. అన్యాయాన్ని అడిగిన వాడు నక్సలైట్.. అడగని వాడు ఆల్ రైట్ అనే ఉద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తుందని విమర్శించారు. హైదరాబాద్ ధర్నా చౌక్ లో శాంతి చర్చల కమిటీ మహా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... అణిచివేయాల్సింది మావోయిస్టులను కాదు దోపిడీని అని అన్నారు. మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యమని అన్నారు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ . ఇది యుద్ధ సమయం కాదు.. చర్చలతోనే పరిష్కరించుకోవాలని మాస్కో సైప్రస్ లో అన్న మోదీ మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపరని ప్రశ్నించారు. మావోలతో చర్చలు జరపకున్నా సరే... ఆదివాసీ సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. భారత రాజ్యాంగం ఆధారంగా చర్చలు జరపండి. దేశంలోని సహజ వనరులను ప్రజల అభివృద్ధి కోసమే వాడాలని రాజ్యాంగంలో తెలిపిందన్నారు. చర్చలు జరిపితే ఆదివాసీ ప్రాంతాల్లో అల్లకల్లోలం ఆగుతుందన్నారు. చర్చలు జరగకుంటే మావోయిస్టులకు ఇబ్బంది లేదు... ప్రభుత్వానికి ఇబ్బంది లేదు. కానీ ఆదివాసీ బిడ్డలకు కష్టం వస్తుంది.. వారి హక్కుల భంగం కలుగుతుందని హెచ్చరించారు. మావోయిస్టులైన భారత పౌరులను చంపుతున్న మోదీ,అమిత్ షా... వీళ్లేం హిందువులని ప్రశ్నించారు. ఇదేనా రామ రాజ్యం అంటే? ఆపరేషన్ కగార్ ను తక్షణమే ఆపేసి శాంతి చర్చలు జరపాలని అన్నారు. కార్పొరేట్ సంస్థల కోసమే ఆదివాసీలపై కేంద్రం యుద్ధం చేస్తుందన్నారు ప్రొఫెసర్ హరగోపాల్. శాంతి చర్చలే అభివృద్ధికి మార్గం అవుతుందన్నారు. హై సందర్భంగా మాట్లాడిన ఆయన చర్చలతో మావోయిస్టుల సమస్యకు పరిష్కారమని అన్నారు. అడవిలోకి కేంద్రం ఎందుకు వెళ్తోంది. ఆపరేషన్ కగార్ ప్రైవేట్ సంస్థల కోసమే ఆపడం లేదని విమర్శించారు. చర్చలతోనే మావోయిస్టు సమస్య పరిష్కారమని హరగోపాల్ అన్నారు..

# రాష్ట్ర అభివృద్ధి చూసి ఓర్వలేకపోతున్న బిఆర్ఎస్



భట్టి ఆరోపించారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్న టీఆర్ఎస్ నేతలు బయటకి వచ్చినప్పుడు తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం సంపాదించిన ప్రతి రూపాయిని ప్రజలకు ఖర్చు పెట్టాలనే ఆలోచన చేస్తుంది.. గతంలో సంపాదించిన ప్రతి రూపాయిని దోచాలని ఆలోచనతో ఉండేవాళ్లు అని ఆయన ఎద్దేవా చేశారు. అందుకే ఈ రాష్ట్రం అభివృద్ధి జరగలేదు, ఇక్కడ ప్రజల స్థితిగతుల్లో మార్పు జరగలేదు అన్నారు. ఇది గమనించిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్నికి అధికారంలోకి తీసుకొచ్చారని వెల్లడించారు. భూపాలపల్లి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శ్రీధర్ బాబుతో కలసి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో రైతులు వాడిన విద్యుత్ కు పెద్ద ఎత్తున బకాయిలు పెట్టిన వాటిని కూడా ఈ ప్రభుత్వం చెల్లించి.. ఉచిత కరెంటు ఇస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రైతు భరోసా డబ్బులు పడుతున్నాయి.. 9 రోజుల్లోనే రాష్ట్రంలో ఉన్న అర్హులైన రైతులందరికీ రైతు భరోసా డబ్బులు పడతాయని తేల్చి చెప్పారు. ఏడాదికి 70 వేల కోట్ల రూపాయలను రైతుల కోసం ఖర్చుపెట్టింది ఒక్క తెలంగాణ ప్రభుత్వమే.. ఐదేళ్లలో మూడు లక్షల 50 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చెప్పబోతున్నాం.. ఇంత పెద్ద మొత్తంలో రైతుల కోసం ఖర్చుపెట్టిన ప్రభుత్వం దేశంలో ఏక్కడ లేదు.. రూ. 500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నాం.. రాష్ట్రంలో పారిశ్రామికంగా, సంక్షేమ పరంగా, వ్యవసాయ లాంటి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. రూ. 38 వేల కోట్ల నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష కోట్లకు పెంచి.. అందిన కాడికి దోచుకున్నారు.. ఆ ప్రాజెక్టు ఇప్పుడు పనికి రాకుండా పోయింది అని భట్టి పేర్కొన్నారు. సమస్యలు ఉన్నవారు రాజధాని వరకు రాలేరని, ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించే వాళ్లు ఉండటం గొప్ప విషయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు ఉండదని గత పాలకులు దుష్ప్రచారం చేశారు. ఈ ఏడాది మార్చిలో గరిష్ఠంగా 17,162 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశాం అన్నారు. నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి చేసిన అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు. 29 లక్షల పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. సాగుకు ఉచిత విద్యుత్ కోసం రూ. 11,500 కోట్లు కేటాయించాం. పేదల ఇళ్లకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. గృహజ్యోతి, ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ కోసం ఏటా రూ. 13వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాం. 1 కోటి 49లక్షల 35వేల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా వేస్తున్నాం'అని భట్టి తెలిపారు. భూపాలపల్లిలో పలు అభివృద్ధి కార్యాక్రమాల్లో మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. జిల్లాలోని గోరికొత్త పల్లి మండలం చెన్నాపూర్ లో కోటి 40 లక్షలతో సబ్ స్టేషన్ ప్రారంభం చేసుకున్నామన్నారు. విద్యుత్ కు అంతరాయం కలగకుండా రూ. 8 కోట్ల వ్యయంతో 33/11 కేవీతో మంజూరు నగర్, ధర్మారావు పేట, నవాబుపేటలలో విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని వెల్లడించారు. అలాగే, దీర్ఘకాలికంగా సమస్య లేకుండా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంట్ ఉండదన్నారు, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంతరాయం కలగకుండా 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. 6 హామీలలో భాగంగా రాష్ట్రంలో 50 లక్షల మందికి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నామని తేల్చి చెప్పారు. జిల్లాలో 47 వేల కుటుంబాలకు 200 యూనిట్ల విద్యుత్ ఇస్తున్నాం.. 46 వేల వ్యవసాయ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లకు ఉచిత కరెంటు ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇక, సౌర శక్తి ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు మహిళా సంఘాలకు ఇవ్వడానికి సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రణాళికలు రచిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పాఠశాలకు ఉచిత కరెంట్ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నాం.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బంది ఉన్నప్పటికీ, 7 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్టాన్ని సంక్షేమ పథంలో తీసుకెళ్తున్నామన్నారు. బీఆర్ఎస్ వాళ్ళు ఉచిత బస్ ప్రయాణం ఎందుకు ఇస్తున్నారు అని విమర్శిస్తున్నారు.. ఎందుకు ఇస్తున్నామో మహిళలను అడగండి అని సూచించారు. ఇక, గోదావరి నదీ జలాల కొరకు మేడిగడ్డ, సుందిల్ల, అన్నారం ప్రాజెక్టులను నిర్మించామని గొప్పలు చెప్పే వాళ్ళు ఈ ప్రాంతానికి ఒక చుక్క నీరు ఇవ్వకుండా తరలించుకెళ్లారని మండిపడ్డారు. గోదావరి నది జలాలకు సంబంధించి ఎగువన ఉన్న మహారాష్ట్ర, దిగువన ఉన్న ఆంధ్ర వాళ్ళు తెలంగాణ రాష్టానికి నీరు ఇచ్చిన తర్వాతే మీరు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ట్రిబ్యునల్ ముందు మా రాష్ట్రానికి నీరు ఇచ్చిన తర్వాతే పక్కా రాష్ట్రాలకు నీటిని తరలించాలని అప్పుడే చెప్పామని శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. అలాగే, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత సన్న బియ్యం ఇస్తామని చెప్పాం.. ఇస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాం.. కొంచం సమయం పట్టొచ్చు కానీ చేసి చూపిస్తాం.. ఇక, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతాం.. అభివృద్ధి చేసి చూపిస్తామని వెల్లడించారు. కొత్త జిల్లాలో కొత్త మండలాలకు విద్యుత్ ఏఈ కార్యాలయాలు మంజూరు చేశారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి నా కృతజ్ఞతలు.. దీంతో పాటు ఇల్లు లేని నిరుపేదలకే ఇవ్వాలని కలెక్టర్ లకు చెప్పాం.. ఇందిరమ్మ ఇండ్లు ఎక్కువగా అవసరం ఉన్న కూడా కలెక్టర్ చూసి కేటాయిస్తుంది.. వచ్చే విడతలో తప్పకుండా ఇల్లు లేని పేదల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చెప్పారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటివారున్నా శిక్షపడాల్సిందే....



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** అసెంబ్లీ ఎన్నికల వేళ టీపీసీసీ ఛీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయన మంగళవారం జూబ్లీహిల్స్ పిఎస్ కు విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్ చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. తమ ఫోన్లు ట్యాప్ చేసి బీఆర్ఎస్ రాజకీయ లబ్ది పొందిందని, ఇంకోసారి ఇలాంటివి జరగకుండా అధికారులు, నేతలకు శిక్ష పడాలని సూచించారు. టెలిగ్రాఫ్ చట్టానికి తూట్లు పొడుస్తూ తమ ఫోన్లను ట్యాప్ చేశారని మండిపడ్డారు. రాజకీయనాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం హేయమైన చర్య అని ఫోన్ల ట్యాపింగ్ కు పాల్పడిన మాజీ సిఎం కేసీఆర్, బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిగ్గుతో తలవంచుకోవాలని అన్నారు. సుమారు 650 మంది సీనియర్ కాంగ్రెస్ నేతల ట్యాప్ జరిగిందని, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎంతటివారున్నా శిక్షపడాల్సిందేనని డిమాండ్ చేశారు. రాజకీయ నేతలు, జడ్జిలు, అధికారుల ఫోన్లనూ ట్యాప్ చేశారని, ఫోన్ ట్యాపింగ్ వల్లే కాంగ్రెస్ కొన్ని స్థానాల్లో ఓడిపోయిందని ఎద్దేవా చేశారు. నక్సల్స్ తో సంబంధం ఉందనే అసత్య ఆరోపణలతో తమ ఫోన్లు ట్యాప్ చేశారని, బీఆర్ఎస్ ఓడిపోతుందని తెలిసే.. హార్డ్ డిస్కలను ధ్వంసం చేశారని మహేశ్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు.

## ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ సన్నిహితుడు మృతి



**న్యూఢిల్లీ(ఆకాంక్ష న్యూస్) :** ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటికే పలువురు కీలక నేతలను ఇరాన్ కోల్పోయిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇరాన్ అత్యున్నత సైనిక కమాండర్, ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ కి అత్యంత సన్నిహితుడు అలీ షాద్మానీ హతమయ్యారు.పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. ఇజ్రాయెల్ హమాస్ యుద్ధంతో ఇప్పటికే ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండగా.. తాజాగా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం మొదలైంది. గతవారం ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట దాడులు ప్రారంభించినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వరుసగా ఐదో రోజు కూడా ప్రతిదాడులతో ఇరు దేశాలూ విరుచుకుపడుతున్నాయి. ఇక ఈ దాడుల్లో ఇరాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగులుతోంది.

## ఎమ్మెల్సీ కవిత సంచలన ప్రకటన....



**మెదక్(ఆకాంక్ష న్యూస్) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు జూలై 17న దేశవ్యాప్తంగా రైల్ రోకో చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట?ఖ కవిత ప్రకటించారు. మెదక్‌లో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ఈ ప్రకటన చేశారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, "బీసీలు దేశ ప్రజాభాగస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి న్యాయం జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై మౌనంగా ఉంది. దాన్ని మేలుకోలేకపోతే, మేమే కదలిక ప్రారంభించాల్సి ఉంటుంది," అని స్పష్టం చేశారు.రిజర్వేషన్ల కోసం జరుగుతున్న పోరాటం ఇక మౌనంగా ఉండదని హెచ్చరించిన కవిత, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీసీ సంఘాలను, ప్రజా సంఘాలను కలిసి సమన్వయం పెంచి ఉద్యమాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు.ఇది ఎన్నికల రాజకీయాల్లో చేసే వాగ్దానాల పోరాటం కాదు. ఇది సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటం. బీసీ సమాజానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన సమయం ఇది," అని కవిత వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో పలువురు బీసీ సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. బీసీలకు తగిన ప్రాతినిధ్యం లభించేందుకు పార్లమెంటు స్థాయిలో చట్టం కావాలని వారు డిమాండ్ చేశారు.జూలై 17న రైల్ రోకో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలంటూ బీసీ సంఘాలను, విద్యార్థి సంఘాలను, సామాజిక సంస్థలను కవిత పిలుపునిచ్చారు.బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందంటూ కవిత స్పష్టం చేశారు.

## తెలంగాణ ప్రాజెక్టులు ఆపాలన్న దురుద్దేశం తమకు లేదు: మంత్రి నిమ్మల



**అమరావతి(ఆకాంక్ష న్యూస్) :** మమ్మల్ని విమర్శించే తెలంగాణ నేతలు వారు చేసిన పనులు గుర్తుచేసుకోవాలని ఎపి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తెలంగాణ ప్రాజెక్టులు ఆపాలన్న దురుద్దేశం తమకు లేదని తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండానే తెలంగాణ అనేక ప్రాజెక్టులకు టెండర్లు పిలిచిందని, కాళేశ్వరం, సీతారామసాగర్ ప్రాజెక్టులను అనుమతి లేకుండానే చేపట్టారని అన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టును అనుమతి లేకుండానే చేపట్టలేదా? అని ప్రశ్నించారు. ప్రాథమిక దశ లోనే ప్రాజెక్టును అడ్డుకోవడం సమంజసమేనా? అని నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# విద్యార్థుల భద్రతపై నిర్లక్ష్యం

### గోదావరిఖని ఆర్.ఎఫ్.సి.ఎల్ లోని శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాలపై ఆర్టీఏ చర్య....

### అక్రమాలకు కట్టడి లేకపోతే కార్పొరేట్ పాఠశాలలే కంటకంగా మారతాయి!

**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** విద్యార్థుల భవిష్యత్తు కోసం నిత్యం కృషి చేయాల్సిన విద్యాసంస్థలు, వారినే ప్రమాదంలోకి నెట్టే విధంగా వ్యవహరిస్తుంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గౌతమ్ నగర్ ప్రాంతంలోని %=ఖీజూ% లో ఉన్న శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల తాజాగా మరో వివాదంలో చిక్కుకుంది.ఆర్ఎఫ్‌సీఎల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల రవాణా నిర్వహించిన ఈ పాఠశాల బస్సును మంగళవారం ఉదయం గోదావరిఖని ఆర్టీఏ అధికారులు నిలిపివేసి సీజ్ చేశారు. బస్సులో సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించడం, డ్రైవర్‌కు సరైన అనుభవం లేకపోవడం, బస్సు పత్రాల్లో చెల్లింపులు గడువు మించిపోయినట్లు అధికారులు గుర్తించినట్లు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అనంతరం బస్సును సీజ్ చేశారు.



**గతంలోనూ వివాదాలు:**

శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల పేరు గతంలోనూ అనేక వివాదాల్లో నిలిచింది. అనుమతుల్లేని పుస్తక విక్రయాలు, అధిక ఫీజుల వసూలు, ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అందించకపోవడం, విద్యార్థులపై ఒత్తిడి పెడుతూ మానసికంగా వేధింపులకు గురిచేసినట్లు పలుమార్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనితోపాటు విద్యార్థులను చితకబాదిన సంఘటనలు ఎన్నో వెలుగు చూశాయి. ఇదేమిటని ప్రశ్నించిన తల్లిదండ్రుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తీరు గతంలోనూ చోటు చేసుకున్నాయి. ఇదిలా ఉంటే పాఠశాలలో పనిచేసిన కొంతమంది పై కులం పేరుతో దూషించిన కేసులు సైతం నమోదైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతోపాటు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో పనిచేస్తున్న కొంతమందిని చితకబాదిన సంఘటనలు ఉన్నాయి.

**తల్లిదండ్రుల ఆగ్రహం....**

బస్సు సీజ్ వార్త వెలువడిన వెంటనే పాఠశాలలో తమ పిల్లలను చదివిస్తున్న కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రతి నెల వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ, కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఇలాంటివి చేయడమేంటి? పిల్లల ప్రాణాలను సరాసరి ప్రమాదంలోకి నెట్టడమే" అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తల్లిదండ్రులు విద్యాశాఖకు, ట్రాన్స్‌పోర్ట్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. 'కార్పొరేట్ విద్యా సంస్థల ధోరణి వల్ల పిల్లలు చదువు పేరుతో కష్టాల పాలవుతున్నారు. నిబంధనలకు లోబడి నడవలేకపోతే ఇలాంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇలా పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు కార్పొరేట్ పాఠశాలలను ఎన్నుకుంటున్నా, వాటి నిర్వాహకుల నిర్లక్ష్యంతో విద్యార్థుల ప్రాణాలే ప్రమాదంలో పడుతున్నాయి. గోదావరిఖనిలోని %=ఖీజూ% శ్రీ చైతన్య పాఠశాల ఘటన ఈ తరహా భయాన్ని మరింత పెంచింది. సంబంధిత శాఖలు వెంటనే జోక్యం చేసుకుని నిర్లక్ష్య పాలకులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

# రైతును రాజు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది

- **అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం.....**
- **ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు...**

**పెద్దపల్లి (ఆకాంక్ష న్యూస్) :** రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, రాబోయే రోజుల్లో ప్రతి అర్హుడికి 'ఇందిరమ్మ ఇండ్లు' అందేలా చర్యలు చేపడతామని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు తెలిపారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దంపేట, లక్ష్మీపూర్, ఆరేపల్లి, మల్యాల, మీర్జంపేట, తారుపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు వేసి, మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మిర్జాంపేట గ్రామంలో రూ.13 లక్షల రూపాయలతో దాతల సహాయంతో నిర్మించిన రామాలయం షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే విజయరమణారావు రైతు భరోసా పథకాన్ని చేపట్టిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వర్షాకాల పంటకు రైతులకు ప్రత్యక్ష లాభం చేకూరుతోంది. ఇప్పటికే రెండు ఎకరాల వరకూ రైతులకు ప్రభుత్వం నిధులు అందించింది. రూ.2 లక్షల రుణ మాఫీ, సన్నవడ్లకు బోనస్ వంటి పథకాలతో రైతులు ముందంజ వేస్తున్నారు. గత 30 ఏళ్లలో ఇంతటి రైతు మద్దతు కలిగిన ప్రభుత్వం రాలేదని చెప్పగలను" అని అన్నారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు, ఈసారి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గింజ కటింగ్ లేకుండా పూర్తిగా కొనుగోలు చేశామని చెప్పారు. వేసవిలో టేలాండ్ ప్రాంతాలకు సాగునీరు అందించి పంటలను కాపాడామన్నారు.ఇసుక మాఫియాపై పోరాటం చేసి, ఇప్పుడు ఇంటి నిర్మాణాల కోసం ప్రజలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక సౌకర్యం కల్పించామని తెలిపారు. బట్టీల యజమానులకు ప్రభుత్వ ధరల ప్రకారమే మట్టి పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. "నేను ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. ఏం ఉన్నా నిరూపిస్తే రామాలయం దేవుని సాక్షిగా మానేస్తాను" అని సవాల్ విసిరారు. ఇటుకలు తక్కువ ధరకు అందించాలని బట్టి యజమానులకు సూచించగా, వారు అంగీకరించినట్లు తెలిపారు. భూమి ఉన్న ప్రతీ అర్హుడికి ఇండ్లు నిర్మించుకునే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.పెద్దంపేటలో 2009లో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.1 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్లను గుర్తుచేసిన ఆయన "2009-14 మధ్యకాలంలో నేను చేసిన అభివృద్ధి తప్ప, టీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎక్కడా అభివృద్ధి కనిపించదు" అని విమర్శించారు.సమ్మక్క సారలమ్మ జాతర రోడ్డుకు బీటీ రోడ్డు వేయిస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే, పంట మార్పిడి చేసుకొని రైతులు అధిక లాభాలు పొందాలని సూచించారు.

ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పిటిసిలు లంక సదయ్య, వంగల తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజన వేనసదయ్య తదితర నేతలు, అధికారులు, లబ్ధిదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.








# రేపటిలోగా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలి

### ...కేటీఆర్ కు ఆదేశాలు జారీ చేసిన ఏసీబీ...



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** ఫార్ములా ఈ కార్ రేసు కేసులో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ లను స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైంది. నిన్న ఫార్ములా ఈ కేసులో ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు వేసిన పలు ప్రశ్నలకు కేటీఆర్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం ఆయన వాగ్మూలాన్ని రికార్డు చేశారు. ఈ విచారణ అనంతరం కేటీఆర్ వాడిన సెల్‌ఫోన్, మ్యాక్‌బుక్, ట్యాబ్‌లో కీలక సమాచారం ఉందని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. ఈ ఎలక్ట్రానిక్ పరికరాల నుంచే కేటీఆర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారని అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ లను పరిశీలించేందుకు ఏసీబీ నిర్ణయించింది. కేటీఆర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా డాక్యుమెంట్లను రెడీ చేస్తున్న ఏసీబీ అధికారులు.. రేపటిలోగా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని కేటీఆర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో న్యాయ సలహా ప్రకారం నడుచుకుంటానని కేటీఆర్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలన ప్రజల నమ్మకాన్ని నీరుగార్చింది

## బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్



హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) : బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ తీవ్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి పాలనా అనుభవం లేకపోవడం స్పష్టమవుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీ, ఎస్సీ, యువ డిక్లరేషన్ల పేరుతో చేసిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి అధికారులను పట్టించుకోవడం లేదని, సీఎంఓ ఆదేశాలకే అధికారులు స్పందించకపోవడం దురదృష్టకర మన్నారు. పాలనా వైఫల్యాలను ఉద్యోగులపై నెట్టే చర్యలు అనాగరికమని ఎస్. కుమార్ మండిపడ్డారు.

### విద్య, వైద్యం రంగాల్లో విఫలమవుతున్న ప్రభుత్వం....

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీని ప్రభావం వేలాది మంది విద్యార్థులపై పడుతోందన్నారు. బీటెక్, ఎంటెక్ విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీల్లోనే ఉండిపోవడం వల్ల విద్య పూర్తి చేసినా వారు ఉద్యోగాలకు అర్హత సాధించలేక కూలీ పనులకు దిగిపోతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ బకాయిల పేరుతో ప్రైవేట్ ఆసుపత్రులు సేవలందించడం లేదని, ఇది సామాన్యుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే చర్యగా ఎస్. కుమార్ పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నింటినీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిలిపివేయడం బాధాకరమన్నారు.

### ఉద్యోగుల హక్కులపై దాడి చేస్తున్న ప్రభుత్వం....

రిటైర్డ్ ఉద్యోగుల పీఎఫ్, పెన్షన్, ఇతర బెనిఫిట్లు ఇవ్వలేమన్న మాటలు సీఎం నోటినుంచి రావడం దారుణమని ఎస్. కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను అడ్డుకునే అధికారం కలిగి లేదని, తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు.

### కేంద్ర పథకాల అమలులో నిర్లక్ష్యం....

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ వయో వందన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిందని విమర్శించారు. 70 ఏళ్ల పైబడిన వృద్ధులకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందించే ఈ పథకాన్ని తెలంగాణలో అమలు చేయకుండా నిర్లక్ష్యం చూపుతోందన్నారు.

### ఓట్ల కోసం మాత్రమే హామీల ప్రకటనలు....

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రైతులకు 9 రోజుల్లో రూ.9,000 కోట్లు ఇవ్వబోతున్నామని ప్రకటించడం కేవలం ఓట్ల కోసమేనని ఎస్. కుమార్ ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉందని, అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆశలు వమ్ము చేయకుండా, హామీల అమలులో సీఎం బాధ్యత వహించాలి" అని బీజేపీ నేత ఎస్. కుమార్ స్పష్టం చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త మలుపు..

- "నా ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి....
- వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు...


హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : రాష్ట్రంలో రాజకీయ వేడి రోజు రోజుకీ పెరుగుతుండగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో సంచలన మలుపు తలెత్తింది. ఈ కేసులో కేంద్ర బిందువుగా మారిన వైఎస్ షర్మిల తాజాగా చేసిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. నా ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. హైదరాబాద్‌లోనే ఈ ట్యాపింగ్ జరిగింది" అంటూ ఆమె తీవ్రంగా మండిపడ్డారు. తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ... ఎవ్వరితో మాట్లాడుతుంటే ఆ సమాచారం వెంటనే ముఖ్యమంత్రి జగన్‌కి చేరుతుందని తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. షర్మిల ప్రకారం, తాను మాట్లాడే విషయాలన్నీ ముందుగానే తెలిసినట్లు ఎదుటివారు స్పందించడంతో తనపై నిఘా ఉన్నట్లు స్పష్టమైందని చెప్పారు. దీనివల్లే కొన్ని వారాల క్రితం తన వ్యక్తిగత ఫోన్లు మార్చాల్సి వచ్చిందని వెల్లడించారు. ఇక ఆమె ఆరోపణల్లో మరొక సంచలన అంశం ఏమిటంటే ၊ తనకు సంబంధించిన విషయాలను పసిగట్టకుండా ఉండేందుకు అప్పటి ట్యాపింగ్ టీమ్ కోడ్ లాంగ్వేజ్ వాడేదన్నది. ఇంత వరకూ విచారణలో ఆరోపణల పాలైన టీఎస్ఎస్ ఎస్పీ ప్రభాకర్ రావు టీమ్ కోడ్ పేర్లతో సంభాషణ జరిపేదని షర్మిల వాదిస్తున్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వ వర్గాలు ఇప్పటికీ స్పందించలేదు. అయితే ఇటీవలి ట్యాపింగ్ కేసులో ఐపీఎస్ అధికారుల నామాలు బయటకు రావడం, టీమ్స్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు అరెస్టు కావడం, జగన్ సర్కారుపై విచారణ ఊపందుకోవడంతో షర్మిల వ్యాఖ్యలు మరింత చర్చకు దారితీశాయి. ఇటీవలి రోజుల్లో షర్మిల రాజకీయంగా కూడా తిరిగి ఉత్సాహంగా వ్యవహరిస్తుండటం, టెక్కింగ్ వ్యవహారంపై ఢిల్లీ అధికార వర్గాల దృష్టి సైతం పడటం... ఈ వ్యవహారానికి జాతీయ స్థాయిలో ప్రాధాన్యతను తీసుకొచ్చాయి. పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులపై నిఘా పెట్టారని ఆరోపణలు వినిపిస్తున్న ఈ నేపథ్యంలో... షర్మిల చేసిన వ్యాఖ్యలపై అధికార బృందం ఎలా స్పందిస్తుందో, కేంద్రం దృష్టిలోనూ ఈ అంశం ఎలా పరిణమించబోతుందో



అన్నది ఆసక్తికరంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఇప్పటికే విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్న తరుణంలో... వైఎస్ కుటుంబంలోనే తీవ్ర ఆరోపణలు రావడం రాజకీయ వర్గాల్లో కదలికలు కలిగించింది.

# మేజిక్ రాజాకు ఆత్మీయ సత్కారం...





- కళారంగంలో ఖని ఐకాన్ మేజిక్ రాజా...
- బ్రహ్మరథం పట్టిన కళాకారులు, కళా సంఘాల ప్రతినిధులు...

గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : కళాకారుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి మేజిక్ రాజాను స్థానిక కళాకారులు, కళాసంఘాల ప్రతినిధులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కళారంగంలో ఆయన ప్రతిభను, చేసిన సేవలను కొనియాడారు. ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన వసుంధర విజ్ఞాన వికాస మండలి 32వ వార్షికోత్సవ వేడుకలలో రాజా స్ఫూర్తి పురస్కారాన్ని అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని నిరీక్షణ ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో స్థానిక గోదావరి కళా సంఘాల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం రాజాకు ఆత్మీయ సన్మానాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అవకాశాలు అందుబాటులో లేని రోజుల్లో.. ప్రత్యక్ష గురు శిక్షణ లేకుండా రాజా పలు కళలలో ప్రావీణ్యం సంపాదించడం, పలు రాష్ట్రాలలో ప్రదర్శనలివ్వడమే కాకుండా.. లెక్కకు మిక్కిలి అవార్డులు, పురస్కారాలు అందుకోవడం అభినందనీయమన్నారు. రాజా కవి, రచయిత, వ్యాఖ్యాత, ఇంద్రజాలికుడు, ధ్వన్యనుకరణ, మూకాభినయ కళాకారుడిగా, వెంట్రిలాక్విస్ట్, నటుడిగా, వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో చిరపరిచితులన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి బహిరంగ సభలకు వ్యాఖ్యాతగా వ్యవహరించడం రాజా ప్రతిభకు నిదర్శనమన్నారు. వర్ధమాన కళాకారులకు రాజా మార్గదర్శిగా నిలవాలన్నారు. కళాసంఘాల సమాఖ్య అధ్యక్షులు కనకం రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిరీక్షణ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు పి.చంద్రపాల్, ఇప్టా జాతీయ ఉపాధ్యక్షులు కే.స్వామి, ప్రజానాట్యమండలి, సాంస్కృతిక సారథి, కృషి, శిల్పి, శ్రీలక్ష్మీ నరసింహ, వీరాంజనేయ, స్నేహ, బాలాజీ ఫైన్ ఆర్ట్స్, నటరాజ నృత్య నికేతన్, బిట్ బిట్ డ్యాన్స్ అకాడెమీ, యూ ట్యూబర్స్ అసోసియేషన్, బీసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు దయా నర్సింగ్, కాసిపాక రాజమౌళి, పొన్నం విజయకుమార్ గౌడ్, దేవి లక్ష్మీనర్సయ్య, మొగరం రాంశంకర్, గట్టయ్య, మేజిక్ హరి, నాగెల్లి సాంబయ్య, కొండ్ర రాధాకృష్ణ, కోల కృష్ణ, తిప్పబత్తిని అంజయ్య, మేజిక్ శశి, వేముల అశోక్, కుమార్ పటేల్, పులియాల సతీశ్ కుమార్, గుమ్మడి పెద్దులు, నూకల మొండి, నాగుల శ్రీనివాస్, బీర్క లక్ష్మణ్, గొట్టె నాగరాజు, లెల్ల వెంకటేశ్వరరావు, అట్ల జగ్గయ్య, పులిపాక దేవా, గద్దల శశిభూషణ్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొని రాజాను అభినందించారు.

# డీలర్లు నకిలీ పురుగు మందులు ఎరువులు, విత్తనాలు అమ్మకూడదు

పెద్దపల్లి (ఆకాంక్ష న్యూస్) : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఎరువులు పురుగుమందులు విత్తనాల దుకాణాలను పెద్దపల్లి జిల్లా వ్యవసాయ అధికారి ఆది రెడ్డి సహాయ వ్యవసాయ సంచాలకులు పెద్దపల్లి శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారిని అలివేణి కలిసి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీలర్లు నకిలీ పురుగు మందులు ఎరువులు, విత్తనాలు అమ్మకూడదని స్టాక్ బోర్డులు స్టాక్ రిజిస్టర్లు అన్ని సవ్యంగా కంట్రోల్ ఆర్డర్ ప్రకారం రిజిస్టర్లను నిర్వహించాలని మరియు రైతులు కోరుకున్నటువంటి విత్తన రకాలను గాని , ఎరువులు కానీ పురుగు మందులు కానీ ఇవ్వాలని, గడువు ముగిసినటువంటి పురుగు మందులు కానీ విత్తనాలు కానీ ఎరువులను కానీ ఎప్పటికప్పుడు వెనక్కి తిరిగి పంపించాలని నెట్టి పరిస్థితులలో రైతులకు అమ్మకూడదని తెలిపారు. ఈ సందర్భంగా రైతు సోదరులకు వరిలోమధ్య కాలిక రకాలను వేసుకోవాలని సూచించారు.

# మూడు ఎకరాల వరకు రైతు భరోసా నిధులను విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం




హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : మూడు ఎకరాల వరకు రైతు భరోసా నిధులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసింది. రెండో రోజు రూ.1551.89 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి విడుదల చేశామని ప్రకటించింది. మంగళవారం 3 ఎకరాల వరకు ఉన్న రైతులందరి ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతుభరోసా నిధుల జమ చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకు రైతుభరోసా నిధులు జమ చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన రైతులందరికీ రైతుభరోసా ఇస్తామన్నారు. రైతుల ఖాతాల్లోకి నేరుగా రైతుభరోసా జమ చేయడంతో పాటు రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తుమ్మల వివరించారు.

# భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



కాటారం(ఆకాంక్ష న్యూస్) : భూ సమస్యలు కలిగిన ప్రతి ఒక్కరూ మండలంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కాటారం మండలంలోని నస్తూర్ పల్లి, రఘుపల్లిలో సదస్సులను నిర్వహించారు. నస్తూర్ పల్లి 89 దరఖాస్తులు, రఘుపల్లి 213, మొత్తం కలిపి 302 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నాగరాజు మాట్లాడుతూ దరఖాస్తులు వచ్చిన వాటిలో సాధ్యసాధ్యాలను పరిశీలించి పరిష్కరానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. భూ సమస్యలు కలిగి ఉన్న వారు మీ గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న సదస్సులలో దరఖాస్తులు అందించి సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా తెలిపారు. వారితో పాటు నాయబ్ తహసీల్దార్ మార్క రామ్ మోహన్ గౌడ్, భూ భారతి మండల కో-ఆర్డినేటర్ కొట్టె శ్రీహరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నా రాజీనామా కోరే నైతిక హక్కు మీకు లేదు



బెంగళూర్(ఆకాంక్ష న్యూస్) : బీజేపీ తీరుపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 4న చిన్నస్వామి స్టేడియం లో జరిగిన తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ హోంమంత్రి పరమేశ్వర రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఫ్రీడమ్ పార్కు లో బీజేపీ ఆందోళనకు దిగడంపై సిద్ధరామయ్య స్పందించారు. తనను రాజీనామా చేయమని డిమాండ్ చేసే నైతిక హక్కు బీజేపీకి లేదని సిద్ధరామయ్య మండిపడ్డారు. మహాకుంభమేళా తొక్కిసలాటలో 30 మంది మరణించారని, అందుకు బాధ్యత వహిస్తూ అక్కడి సీఎం రాజీనామా చేశారా..? అని ఆయన ప్రశ్నించారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో 241 మంది ప్రాణాలు కోల్పోయారని అందుకు బాధ్యత వహిస్తూ ఎవరు రాజీనామా చేశారని నిలదీశారు. అంతకుముందు నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి కూలి 140 మంది మరణించారని, అందుకు బాధ్యత తీసుకుని ఎవరూ రాజీనామా చేయలేదు ఎందుకని సిద్ధరామయ్య ప్రశ్నించారు. అయినా నన్ను నేను రక్షించుకోవడానికి ఈ ఉదాహరణలు చెప్పడంలేదని, రాష్ట్రంలో ఏది జరిగినా ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం కరెక్టు కాదని అన్నారు.

# సీఎం దిష్టి బొమ్మ దగ్ధం చేయడం సరికాదు

## బిఆర్ఎస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలి....

## కొలనూరులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం....



ఓదెల, పెద్దపల్లి (ఆకాంక్ష న్యూస్) : బిఆర్ఎస్ నేతలు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ ను ఏసీబీ ప్రశ్నించడం చట్టపరమైన పనిగా గుర్తించాలని గతంలో టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రతిపక్ష పార్టీలపై ఎన్ని కేసులు పెట్టినారో ఆత్మ విమర్శన చేసుకోవాలని ఈ సందర్భంగా హితువు పలికారు. మంగళవారం కొలనూరు గ్రామంలో సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి ప్రజాపాలనకు మద్దతు పలికారు. రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే నాయకత్వంలో అనేక అభివృద్ధి పనులు ముందుకు సాగడంతో ఓర్వలేని బిఆర్ఎస్ నాయకులు ఇలాంటి పనులు చేయడం సిగ్గుచేటని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ స్థానిక నాయకులతో కలిసి పాలభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాజుల శివశంకర్, వెలుపుల కిష్టస్వామి, కర్నా మోహన్ రెడ్డి, కర్రే లక్ష్మారెడ్డి, గోపు కోమల్ రెడ్డి, కర్నా భాస్కర్, అంబుల శంకర్, మకోటి లక్ష్మయ్య, గంట లక్ష్మయ్య, దేవుడి రాజిరెడ్డి, గాజుల వెంకటేష్,

## కళత్మాక యోగా అదరహో... విజేతలకు అవార్డుల పంపిణీ.....జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



**విజయవాడ, ఆకాంక్ష :** యోగాంధ్ర 2025లో భాగంగా జిల్లాలో మూడు రోజుల పాటు వివిధ అంశాలలో యోగాసనాలపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి కళాత్మాక యోగా పోటీలు అదరహో.. అనిపించాయని, న్యాయ నిర్ణేతల సమక్షంలో పారదర్శకంగా పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.అంతార్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర 2025లో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్లో రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి చేసిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18వ తేది బుధవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్విహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో యోగాసనాలకు సంబంధించి పలు అంశాలపై గ్రామ, మండల, పట్టణ జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించి జిల్లా స్థాయిలో విజేతలైన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి ఇబ్రహీంపట్నం మండలం గుటుపల్లి డాన్బాస్కో స్కూల్ నందు న్యాయ నిర్ణేతల సమక్షంలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించి ఎంపిక చేయడం జరిగిందన్నారు. యోగా నృత్యం, యోగా చిత్రలేఖనం, యోగా ఫోటోగ్రాఫీ, యోగా స్లోగన్, వంటి అంశాలపై రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని ప్రతి సచివాలయ పరిధిలో ప్రజలకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చామన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు 15 కేటగిరిలో జూనియర్, యంగ్, సీనియర్ గ్రూపులలో గెలుపొందిన విజేతలు మండల, జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి చేరుకున్నారన్నారు. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొంటారని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశ అన్నారు.సమావేశంలో విజయవాడ ఆర్డివో కె. చైతన్య, డిఇవో యు.వి. సుబ్బారావు ఉన్నారు.

## బొండాడను అభినందించిన ఎన్ యు జే (ఇండియా)



**నాగాయలంక, ఆకాంక్ష :** మారుమూల పల్లె నుంచి మహోన్నత శిఖరాలు అధిరోహించి లక్షలాదిమంది కి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న డైనమిక్ పారిశ్రామికవేత్త బొండాడ గ్రూప్ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ బొండాడ రాఘవేంద్రరావును నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ సంఘ జాతీయ ఉపాధ్యక్షులు బడే ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. నాగాయలంక మండలం మారుమూలపల పర్రచివర గ్రామం నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన వారి పట్టుదల, కృషి , సేవాభావం నేటి యువతకు ఆదర్శం గా నిలిచాయని ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.హైదరాబాద్‌లోని బొండాడ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఒక సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఈ మేరకు ఆయన సేవలను అభినందిస్తూ ఎన్ యు జె (ఇండియా) ఈ మేరకు శాలువాతో సత్కరించి సంఘ జ్ఞాపికను బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కే ఎన్ కుమార్ ఐఏఎస్, ఫార్మర్ చీఫ్ సెక్రటరీ .. బోండాడ రాఘవేంద్రరావు సేవా భావాన్ని ప్రశంసించారు.కేవలం తన ఎదుగుదలకే పరిమితంగా కాకుండా, వేదలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని బొండాడ సేవలను కొనియాడారు. తన సంపాదనలో కొంత భాగాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడం అభినందినీయం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశ ప్రగతిలో ముందు వరుసలో నిలవాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ రైల్వే శాఖ ఉన్నతాధికారి మెండు చక్రపాణి, మేనేజ్మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అండాళ్ అమ్మిశెట్టి , రంగబాబు తదితరులు పాల్గొన్నారు.

## కంజర్ల కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేర్ అండ్ క్యూర్ హాస్పిటల్ మెగా హెల్త్ క్యాంప్..




**శేరిలింగంపల్లి, ఆకాంక్ష** కంజర్ల కృష్ణమూర్తి చారి ఫౌండేషన్ ఆధ్వర్యం లో బిజెపి సీనియర్ నాయకులు, సంఘ సేవకులు కంజర్ల కృష్ణమూర్తి కొల్లూరులో కేర్ ఆండ్ క్యూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి బోజన సదుపాయాలు కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సునంద కృష్ణమూర్తి , శ్రీనివాస్,సాయివెంకట హర్ష, మహిళ సంఘం తరపున అంజలి, అనసూయ, అలివేలు, ఊర్మిల, సి.హెచ్.సతీష్ గౌడ్, పి.సతీష్ గౌడ్ ,డాక్టర్లు పృథ్వి, సాహిత్, కల్పన, నర్సింగ్ స్టాఫ్ విభాగానికి చెందిన స్వాతి, భార్గవి, రోహిత, శిల్ప, పవిత్ర, ల్యాబ్ టెక్నీషియన్స్ మహేష్ ఫార్మసీ విభాగానికి చెందిన లోకేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు అత్యధిక సంఖ్య లో పాల్గొని మెగా హెల్త్ క్యాంప్ ను విజయవంతం చేసారు.

## జూలై 9న జరిగే కార్మిక జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

**పాలకొల్లు, జూన్ 17 (ఆకాంక్ష )** జూలై 9న జరిగే కార్మిక జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సి. ఐ. టి. యు జిల్లా కార్యదర్శి కె. రాజా రామ్మోహన్ రాయ్ కోరారు. మంగళవారం స్థానిక మహిళా సంఘం భవన్ లో సత్తింశెట్టి పురుషోత్తం అధ్యక్షతన మండల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశం లో రాయ్ మాట్లాడుతూ కేంద్రంలోని బి.జె.పి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కార్పొరేట్ శక్తులు కోసం నీరు కారుస్తుందంటూ విమర్శించారు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేసి యజమానులకు బానిసలుగా మార్చాలని చూస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోదీ భజన చేస్తూ చట్టాల్లో మార్పు తెచ్చి పనిగంటలు పెంచిందన్నారు. ఇప్పటి వరకు లేనిది, మహిళలు రాత్రి డ్యూటీ చేయాలని నిర్ణయం చేయడం దుర్మార్గమన్నారు. కనీస రోజు వేతనం తక్కువ చేసి చూపి వేతనాలు పెంపు కొరవద్దనే సంకేతాలు పంపుతున్నారని ఇది కార్మికుడిని దగా చేయడమేనని అన్నారు. సమ్మె ను జయప్రదం చేసి ఐక్యత తో కార్మిక హక్కులు కాపాడుకోవాలన్నారు. అన్ని రంగాల కార్మికులు ఈ సమ్మెలో పాల్గొనేటట్లు చూడాలన్నారు. స్కీమ్ వర్కర్స్ కు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని రాయ్ డిమాండ్ చేసారు. ఈ సమావేశములో జవ్వాది శ్రీనివాసరావు, దేవ సుధాకర్, సి.హెచ్ లక్ష్మి, శ్రీదేవి, గుబ్బల సత్యనారాయణ మాట్లాడారు. వీరవల్లి సత్యనారాయణ, రెడ్డి అప్పారావు, ఇరగరపు రాజు, ఝాన్సీ, పద్మావతి, ముత్యాలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి:జిల్లా కలెక్టర్

**మచిలీపట్నం, ఆకాంక్ష :** జిల్లాలో గృహ నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో గృహ నిర్మాణ పురోగతిపై మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో మండలాల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణ పురోగతి సంతృప్తి స్థాయిలో లేదని, కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. గత 15 రోజుల కిందట గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించి అధికారులకు లక్ష్యాలు నిర్దేశించినప్పటికీ చాలా మండలాల్లో అనుకున్న స్థాయిలో పురోగతి లేదన్నారు. వచ్చే జూలై మాసం




మొదటి వారంలో మరల సమీక్షిస్తామని, ఆ లోపుగా వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను ముందుకు తీసుకువెళ్లి పూర్తి చేయాలన్నారు.ప్రస్తుతం జిల్లాలో గోడల(లింటల్) స్థాయిలో( ఎల్ ఎల్ )8,079 ఇళ్లు, పైకప్పు స్థాయిలో (ఆర్ ఎల్) 2,109 ఇళ్లు, రూఫ్ కాస్టింగ్ (ఆర్ సి) స్థాయిలో 446 ఇళ్లు ఉన్నాయని తెలిపారు. గుడివాడ, గూడూరు, నందివాడ, పెదపారుపూడి, కోడూరు, పామర్రు, ఉయ్యూరు అర్బన్, మొవ్వ, చల్లపల్లి, అవనిగడ్డ మండలాలు పురోగతిలో చాలా వెనుకబడ్డాయని, మండల ప్రత్యేక అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతిలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి వెంకట్రావు, మండల ప్రత్యేక అధికారులు జెడ్పి డిప్యూటీ సీఈవో ఆనంద కుమార్, డిటిడబ్ల్యుఓ ఫణి ధూర్జటి, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, డీఎస్ఓ వి పార్వతి, ఆర్ఐవో సాల్మన్ రాజు, పలువురు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ సంస్థ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## వినూత్న విధానాలతో గాలి నాణ్యతను పెంచుదాం:జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

### విజయవాడ వాయు కాలుష్యం బారిన పడకుండా సమష్టిగా కృషిచేద్దాం

- ఎలక్ట్రిక్/సోలార్ వాహనాల వినియోగం దిశగా ప్రజలను ప్రోత్సహించాలి
- జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టాలి
- విచ్చలవిడి పార్కింగ్‌కు చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకోవాలి
- ఆక్సిజన్ పార్కు అభివృద్ధికి కార్యాచరణ చేపట్టండి
- సాంకేతికత సాయంతో వీటీపీఎస్ బూడిద కాలుష్యం కట్టడికి చర్యలు తీసుకోవాలి
- నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌పై భాగస్వామ్య పక్షాలతో జులై 4న వర్క్‌షాప్

**విజయవాడ, ఆకాంక్ష :** ఆరోగ్య ఆంధ్ర సాకారానికి, కాలుష్య రహిత సమాజానికి మనం పీల్చే గాలి స్వచ్ఛంగా ఉండటం కీలకమని.. వినూత్న విధానాలతో విజయవాడ నగరం వాయు కాలుష్యం బారిన పడకుండా సమష్టి కృషి అవసరమని, ఇందుకు భాగస్వామ్య పక్షాలు చేయిచేయి కలపాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జాతీయ శుద్ధ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ) అమలుపై సమీక్షించేందుకు విజయవాడ నగర ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం జరిగింది. కాలుష్య నియంత్రణ, విజయవాడ నగరపాలక సంస్థ, రవాణా, పరిశ్రమలు తదితర శాఖలు వాయు నాణ్యతను పెంచేందుకు చేపట్టిన పనులు, వాటిలో పురోగతిపై సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణకు మార్గనిర్దేశం చేశారు. నగరం నలువైపులా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల డేటాను ఎప్పటికప్పుడు విశ్లేషించి.. దుమ్మూధూళీ వ్యాప్తి చెందకుండా, గాలిలో పీఎం10 సూక్ష్మ ధూళికణాలను లక్ష్యాల మేరకు తగ్గించే కార్యక్రమాలు పటిష్టంగా అమలయ్యేలా చూడాలన్నారు. 2024-25లో పీఎం 10 సూక్ష్మ ధూళికణాల పరిమాణం 64 '%స్ర/ఎ%గా నమోదైందని, దీన్ని బాగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్య రహిత ప్రయాణానికి వీలుకల్పించేలా రహదారుల నిర్మాణం, పేవ్‌మెంట్ రహదారుల ఏర్పాటు, హరిత విస్తీర్ణం పెంపు, మెకానికల్ స్వీపర్ల వినియోగం, ఘన వ్యర్థాల నిర్వహణ, కాలువ గట్ల హరిత సుందరీకరణ వంటి చర్యలను ముమ్మరం చేయాలన్నారు.

**ఐటీఎంఎస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి:**



సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ ద్వారా వాహనాల సాఫీ ప్రయాణంతో గాలి కాలుష్యం మోతాదును తగ్గించవచ్చని, ఇందుకు ఉపయోగపడే ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐటీఎంఎస్) పనులను రూ. 5 కోట్లతో చేపట్టడం జరిగిందని.. ఈ పనులను త్వరిగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఇష్టానుసారం రోడ్ల వెంబడి వాహనాలు పార్కు చేయకుండా పార్కింగ్ జోన్లు ఏర్పాటు చేయాలన్నారు. బ్యాటరీ వాహనాలతో పాటు పెద్దఎత్తున విద్యుత్, సోలార్ ఈ-రిక్షాలను ప్రోత్సహించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో మరిన్ని వెర్టికల్ గార్డెన్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. నగరాన్ని ఆదర్శవంతంగా నిలిపేలా ఆక్సిజన్‌పార్కు అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. కాలుష్య కారకాలను వెదజల్లే వాహనాలను గుర్తించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీటీపీఎస్ బూడిద, ఇతర కాలుష్య కారకాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు కలెక్టర్ సూచించారు.

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు అడ్డుకట్టవేయండి:**

ఎక్కడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని.. ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్సులు, షాపింగ్ జోన్లు, రైతు బజార్లపై దృష్టిపెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ నియంత్రణపై తీసుకున్న చర్యలు, ప్రత్యామ్నాయ మార్గాలపై అన్ని విభాగాలు నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. వీధి విక్రేతలకూ అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.సమావేశంలో పీసీబీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.శ్రీనివాస్, డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, వీఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్టులు) పి.సత్యకుమారి, ఏపీఐఐసీ జెడ్ఎం కె.బాబ్జి, వీటీపీఎస్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఆర్‌టీవో ఆర్.ప్రవీణ్, జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, డీఎస్‌వో ఎ.పాపారావు, డీఏవో డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల విస్తరణ, అవుటర్ రింగ్డకు భూసేకరణ వేగవంతం చేయండి:జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ.

### మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్స్పెక్షన్ చేయండి..



**విజయవాడ, ఆకాంక్ష :** విజయవాడ - హైదరాబాద్ సెక్షన్ లో జాతీయ రహదారి ఎన్హెచ్ 65ను ఆరు లైన్ల రహదారిగా విస్తరణ, పెదన విసన్నపేట 216ఎనోచ్ జాతీయ రహదారి విస్తరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్స్పెక్షన్ పనులను వేగవంతం చేసి నివేదికలను సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇల్లయ సంబంధిత అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారుల విస్తరణ, అవుటర్ రింగ్ రోడ్లకు భూసేకరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహణ వంటి పలు అంశాలపై మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ సంబంధిత అధికారులతో కలెక్టరేట్లోని పింగళ వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా హైదరాబాద్ విజయవాడ ఎన్ హెచ్ 65 రహదారికి సంబంధించి 226 కి.లో మీటర్ల ఆరు లైన్లల విస్తరణలో భాగంగా నందిగామ డివిజన్లోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలలో జాతీయ రహదారుల అధికారులకు ఎన్జాయిమెంట్ సర్టిఫికెట్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపవలసి ఉందన్నారు. అనుమంచిపల్లి, షేరమహమ్మద్పుట, తోటచర్ల. భీమవరం గ్రామాలకు సంబంధించి ఆయా మండల తహాశీల్దార్లు ప్రతిపాదనలు సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెదన -విసన్నపేట 216 ఎన్హెచ్ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి జిల్లాలో విసన్నపేట తిరువూరు మండలాలలో 9 గ్రామాల నుండి ప్రతిపాదనలు రావాల్సి ఉండగా 5 గ్రామాలకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మిగిలిన గ్రామాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తిరువూరు ఆర్డీవోకు సూచించారు. అవుటర్ రింగ్డ నిర్మాణానికి సంబంధించి జాతీయ రహదారుల అధికారులు అవసరమైన భూమికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని రికార్డులను పరిశీలించి 3ఏ రిపోర్టు తయారు చేసి పంపాలన్నారు. ఇందుకు సంబంధించి కంచికచర్ల, మైలవరం, జి. కొండూరు మండలాలలో 3ఏ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జాతీయ రహదారి గ్రీన్ఫీల్డ్ ఎలైన్ మెంట్ సంబంధించి 273 ఎకరాలకు గాను 243 ఎకరాలను సేకరించడం జరిగిందని మిగిలిన 30 ఎకరాల పట్టా భూమిని సేకరించేందుకు 3ఏ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి భూములను సర్వే చేసి 3డి రికార్డులను సమర్పించాలన్నారు. భూములను సర్వే చేసేందుకు సర్వేయర్లు అందుబాటులో లేకుంటే ఇతర మండలాల నుండి సర్వేయర్లను డిప్యూటేషన్పై నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డివోకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ సూచించారు.సమావేశంలో విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డివోలు కె. చైతన్య, కె. బాలకృష్ణ, కె. మాధురి, ఎన్ హెచ్ ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్లు ఎం.విద్యాసాగర్ (విజయవాడ), ఎం రామాంజనేయ రెడ్డి (ఖమ్మం), టి. పార్వతీశం (అమరావతి), సంబంధిత మండలాల తహసిల్దార్లు ఉన్నారు.



# పెత్తనం అంత అక్కడ ఆయనదే

## ఆయన చెప్పినట్లు వినకపోతే ప్రిన్సిపాల్ నైనా బదిలీ చేయిస్తాడు...



- ఉద్యోగ నియమాకాల్లో చేతులు మారిన వేల రూపాయలు....
- ఓ కార్పొరేట్ పాఠశాలలో సిబ్బందిపై ఆధిపత్యం...

గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : ఆయన అందరిలాగే ఓ సామాన్య ఉద్యోగి, కానీ అక్కడ పెత్తనం మొత్తం ఆయనదే. ఆయన చెప్పినట్లు వినకపోతే ప్రిన్సిపాల్ నైనా బదిలీ చేయిస్తాడనే ప్రచారం ఓ కార్పొరేట్ పాఠశాలలో జోరుగా సాగుతుంది. సదురు కార్పొరేట్ పాఠశాలలో ఆ వ్యక్తి ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే... పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎల్కలపల్లి సమీపంలో నూతనంగా ఏర్పడిన ఓ కార్పొరేట్ పాఠశాల మొదటి నుండి వివాదాలకు నిలయంగానే మారుతుంది. గతంలో ఓ విద్యార్థినిని పాఠశాల గదిలో ప్రిన్సిపాల్ చితకబాదడంతో పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాలు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇదే కాకుండా మరో ప్రిన్సిపాల్ పాఠశాలలో చదివే విద్యార్థి తల్లిదండ్రుల పట్ల ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకోవడంతో విద్యార్థి తల్లిదండ్రులు వచ్చి పాఠశాలలో ప్రిన్సిపాల్ ను చితకబాదిన సంఘటన సైతం చోటుచేసుకుంది. ఇలా ప్రారంభం నుండి ఎన్నో వివాదాలకు నిలయంగా ఉన్న కార్పొరేట్ పాఠశాలలో ఓ వ్యక్తి పెత్తనం ఇప్పుడు చర్చనీ అంశంగా మారింది. అయితే సదురు వ్యక్తి అనుమతి లేకుండా ఏ పని పాఠశాలలో నడవదని, ఆయన చెప్పినట్లు వినకపోతే కొంతమంది సిబ్బందితో కలిసి ప్రిన్సిపాల్ మీద ఫిర్యాదులు చేయించి బదిలీ చేయిస్తాడని ప్రచారం జోరుగా సాగుతుంది. చూడటానికి కేవలం కిందిస్థాయి వ్యక్తిగానే కనిపించిన పాఠశాలలో ఆయన చేసిన సంఘటనలు తెలిస్తే కళ్ళు బైర్లు కమ్మే విషయాలు వెలుగులోకి వస్తాయి. గతంలో పాఠశాలలో ఉద్యోగ నియామకాల విషయంలో జరిగిన అవకాతవకలు బయటపడుతున్నాయి. అయితే గతంలో పాఠశాలలో పలు టీచర్ల నియామకానికి సంబంధించి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వగా కొంతమంది సిబ్బందిని నియమించి సదురు వ్యక్తి వారి దగ్గర నుండి డబ్బులు దండుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే సదురు వ్యక్తికి పూర్తిస్థాయి మద్దతు ఓ వ్యక్తి నుండి ఉండటంతో సదరు వ్యక్తి ఆడింది ఆట పాడిందే పాటగా కొనసాగుతుంది. దీంతో ఇక్కడ జరిగే విషయాలు పై స్థాయి మేనేజ్మెంట్ కు తెలియకుండా కప్పిపుచ్చుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో పాఠశాలను మూసి వేసే పరిస్థితులు నెలకొంటాయానే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికైనా పై స్థాయి యాజమాన్యం స్పందించి విచారణ చేపట్టి జరిగిన అవకతవకలను గుర్తిస్తారా లేదా అనేది వేచి చూడాల్సిందే...




# స్కిట్ డెవలప్మెంట్ ద్వారా నిరుపేదలు,అట్టడుగు వర్గాలు ఆర్థికంగా ఎదగాలి

## కేంద్ర మంత్రి చౌదరి జయంత్ సింగ్ ను కలిసిన కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్...



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : స్కిట్ డెవలప్మెంట్ ద్వారా నిరుపేదలు, అట్టడుగు వర్గాలు ఆర్థికంగా ఎదగాలని కేంద్ర మంత్రివర్యులు చౌదరి జయంత్ సింగ్ అన్నారు. మంత్రి హైదరాబాద్ వచ్చిన సందర్భంగా రైతు సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ సంఘ సభ్యులతో కలిసి మంత్రిని కలిసారు. ఈసందర్భంగా గత ఐదు సంవత్సరాల నుండి ఆరోగ్యకరమైన నవ సమాజం నిర్మించాలని రైతు సంక్షేమ సేవా సంఘం అహర్నిశలు రైతుల సంక్షేమం గురించి పని చేస్తున్న సంఘాన్ని మంత్రి చౌదరి జయంత్ సింగ్ దృష్టికి వెళ్లారు.దీనితి సంఘ సభ్యులకు ఆహ్వానించి సంఘ ముఖ్య ఉద్దేశం తెలుసుకొని మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ సంఘ సభ్యులతో కలిసి మాజీ భారత ప్రధాని గౌరవ చౌదరి చరణ్ సింగ్ జ్ఞాపకార్థం ఒక జ్ఞాపక మంత్రికి బహుకరించారు అనంతరం కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ మాట్లాడుతూ రైతు బాగుంటే దేశం బాగుంటది ప్రజలు బాగుంటరు ఆహారంతోనే ఆరోగ్య పూర్వికులు పండించిన పంటలు పండిస్తూ ప్రకృతిని ప్రజలను కాపాడాలని మన తెలుగు రెండు రాష్ట్రాలలో సంఘం బలోపేతం చేస్తూ ముందుకు వెళ్తుందని తెలిపారు ఈ సంఘానికి కేంద్ర మంత్రివర్యులు నా సంపూర్ణ సహకారము ఉంటాదని హామీ ఇచ్చారు. తన చేతుల ఉన్న స్కిట్ డెవలప్మెంట్ ద్వారా నిరుపేదలకు దళితులకు అట్టడుగు వర్గాలకు ఆర్థికంగా ఎదగనికి నా వంతు సహకారం ఉంటదని కేంద్ర మంత్రివర్యులు చౌదరి జయంత్ సింగ్ హామీ ఇచ్చారు మంత్రి కలవడం మన సంక్షేమ సంఘం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతాదని సంఘ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కొమ్ము ప్రేమ్ సాగర్ యాదవ్ వి అశోక్ గౌడ్ గొర్ల శ్రీనివాస్ యాదవ్ వి విశ్వనాథ్ ఎం ఆగమయ్య ముదిరాజ్ ఆర్ బలరాం యాదవ్ బి శ్రీనివాస్ గౌడ్ హరికృష్ణ ఆంజనేయులు హుస్సేన్ బంగారు యాదవ్ శ్రీనివాస్ టి రమేష్ నేత యాదగిరి గౌడ్ మధు యాదవ్ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన జిహెచ్ఎంసి అధికారి

## కాప్రా వర్గంలో ఎంబి నమోదు కోసం రూ. 1.20 లక్షల డిమాండ్...

హైదరాబాద్, (ఆకాంక్ష న్యూస్) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) కాప్రా వర్గానికి చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. స్వరూప లంచం తీసుకుంటూ అడ్డంగా ఏసీబీ అధికారులకు చిక్కారు. ఎంబి (మెజర్ బుక్) నమోదు చేయడంలో కాంట్రాక్టర్ వద్ద నుంచి రూ. 1,20,000 లంచం డిమాండ్ చేసిన స్వరూపను, ఎలాంటి అనుమానం లేకుండా లంచం తీసుకుంటున్న సమయంలో అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మూలాల ప్రకారం, ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ ఇటీవల జిహెచ్ఎంసి పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను పొందేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం అవసరమైన ఎంబి నమోదు చేయాలని సంబంధిత శాఖకు విన్నవించగా, బి. స్వరూప రూ. 1.20 లక్షలు లంచంగా డిమాండ్ చేసినట్లు తెలిసింది. బాధితుడు వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి పర్యవేక్షణలో ముందస్తు విధివిధానాల ప్రకారం ప్లాన్ వేసి లంచం తీసుకుంటున్న సమయంలో స్వరూపను పట్టుకున్నారు. ఇంజనీర్ స్వరూపను అరెస్ట్ చేసిన అనంతరం అధికారులు ఆమె నివాసంలో సోదాలు నిర్వహించారు. పలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలను సేకరించినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో పూర్తి దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఇటువంటి అవినీతి చర్యలు వెలుగుచూస్తుండటం పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ



నిధులతో అభివృద్ధి పనులు జరుగుతుండగా, అధికారుల చేతుల్లో అవినీతి ఆటల కారణంగా ప్రజలకు నష్టమవుతోందని సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, స్వరూపను విధుల నుంచి తొలగించి, అంతర్గత విచారణకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం..

# మరణించినా.. ఇద్దరికీ చూపునిచ్చాడు..!



గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : గోదావరిఖని ఎల్బీనగర్ కు చెందిన బొల్లి సతీష్(35) అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. సతీష్ అకాల మరణంతో విషాదంలో ఉన్న కుటుంబం.. మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి సతీష్ నేత్రాలను దానం చేసి బస్తీలో స్పూర్తిగా నిలిచారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. నేత్రదానంపై కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించగా, సతీష్ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సీనియర్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో, మంగళవారం మృతిని నేత్రాలను సేకరించి హైదరాబాదుకు తరలించారు. దుఃఖంలో కూడా సతీష్ నేత్రాలను దానం చేసి, ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి ముందుకు వచ్చిన మృతుని తల్లి విజయ, సోదరులు కిషోర్, రమేష్ ను ఎన్ ఎస్ యూ ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెంటం ఉదయ్ రాజ్ తోపాటు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి ముఖ్య సలహాదారులు నూక రమేష్ కార్యదర్శి భీష్మాచారి ప్రచార కార్యదర్శి కే. ఎస్.వాసు, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.మల్లికార్జున్ తదితరులు అభినందించారు.

# ఓదెల ప్రజల కలకు రూపం....

ఓదెల, పెద్దపల్లి(ఆకాంక్ష న్యూస్) : పెద్దపల్లి జిల్లా ఓదెల మండల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన హై లెవెల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన వేళ సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఓదెల మండలం రూపునారాయణపేట వద్ద మానేరు వాగుపై నిర్మించనున్న ఈ వంతెనకు బుధవారం ఉదయం 9 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ వంతెన నిర్మాణానికి రూ.80 కోట్లు మంజూరు చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2024 డిసెంబర్ 4న పరిగణనలోకి తీసుకొని, అధికారికంగా ప్రకటన చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణరావు నిరంతరంగా తహతహలాడుతూ ఈ ప్రాజెక్టు కోసం కృషి చేశారు. ఇటీవల టెండర్లు పూర్తవడంతో నిర్మాణం ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఓదెల మండలం రూపునారాయణపేట తాటివనంలో శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో, స్థానిక ప్రజలు, రైతులు, మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశముంది. కార్యక్రమానికి మండలాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరుకానున్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయిన అనంతరం ఓదెల మండలానికి రవాణా దారుల్లో సులభతరం కలుగుతుందని, పంటల రవాణా, ప్రజా ప్రయాణానికి మరింత వీలవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మానేరు వాగుపై వంతెన నిర్మాణం ఓదెల ప్రాంత అభివృద్ధికి కొత్త దారులు తెరిచే చారిత్రాత్మక అడుగుగా నిలిచిపోనుందని పెద్దపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రకటించింది.

# దేశ రాజధాని ఢిల్లీలో కుంభవృష్టి...



న్యూఢిల్లీ(ఆకాంక్ష న్యూస్) : దేశ రాజధాని ఢిల్లీ లో కుంభవృష్టి కురిసింది. నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రోడ్లపై భారీగా వరదనీరు నిలువడంతో చెరువులను తలపిస్తున్నాయి. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిపాల్‌పూర్ ఏరియాలోని ఓ కూడలిలో వరదనీరు నిలువడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మహదేవ్ రోడ్, వీడీ మార్గ్, నోయిడా సెక్టార్ 11 తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం కుంభవృష్టి పడింది. మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టాయి. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆ వెంటనే భారీగా వర్షం మొదలైంది. మహిపాల్‌పూర్ ఏరియాలో రోడ్లపై వరదనీరు నిలువడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి

# వాజీద్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా హార్కరా జన్మదిన వేడుకలు.



గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : రామగుండం రైల్వే స్టేషన్ తబిత బాలల సంరక్షణ సంస్థ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హార్కరా వేణుగోపాల్ రావు జన్మదినం సందర్భంగా కేకు కట్ చేసి అన్నదానం నిర్వహించి, పండ్లు పంపిణి చేశారు.అమ్మపరివార్ స్వంచందా సేవ సంస్థ, గోదావరిఖని ఆధ్వర్యంలో ఎంతోమంది నిరుపేదలకు, వృద్దులకు, వికలాంగులకు, అనాధలకు అన్నదానం నిర్వహించారు.గోదావరిఖని, రామగుండంలో పిల్లల సంరక్షణ కేంద్రంలో అన్నదానం పండ్ల పంపిణీ, నోట్ బుక్స్ పంపిణి చేసారు.అలాగే కిడ్నీ డయాలసిస్ ఉన్న నిరుపేద రోగులకు తనవంతు సాయంగా పాకెట్ మనీ అందచేసారు.గోదావరిఖని జ్యోతి గాంధీ ఫౌండేషన్ నిర్వహణలో నిస్సయులకు అపన్న హస్తం అందజేశారు. విద్యార్థి, విద్యార్థినులు, ఆనాధలు, నిరుపేదలు, వికలాంగులు,నిర్వహించిన వాజీద్ ఖాన్ కి కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ రామగుండము మండల అధ్యక్షులు అర్కూటీ రాయమల్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నామాల కుమారస్వామి, అరుమూళ్ళ సదానందం, జావీద్ ఖాన్, సల్మాన్, రియాజ్, నాయబ్, అస్లాం, ఖలీమ్ గౌస్, జలీల్, నరేష్, సాగర్, సతీష్ పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ నిలిపేయాలి....



హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : మావోయిస్టుల సమస్యను శాంతిపూరితంగా పరిష్కరించాలనే డిమాండ్ చేస్తూ, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ఆపరేషన్ కగార్"ను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇంద్రపార్క్ వద్ద మంగళవారం సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించబడింది.ఈ ధర్నాలో కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, ప్రఖ్యాత మానవ హక్కుల కార్యకర్త డాక్టర్ హరగోపాల్, రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్, ప్రముఖ సినీ నటుడు నారాయణమూర్తి, వామపక్ష పార్టీల నేతలు, ఇతర మాపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ తరపున మల్లు రవి, టిఆర్ఎస్ తరపున ఎమ్మెల్సీ దాసు శ్రావణ్ లు ఈ ధర్నాకు మద్దతు తెలిపారు. మానవ హక్కుల సంఘాల నేతలు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజా సంఘాలు, వామపక్ష భావజాలాన్ని నమ్మే ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు సమస్యను బలవంతపు దణ్డన చర్యల ద్వారా కాకుండా, రాజకీయ పరిష్కార మార్గాల్లో శాంతిచర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు. ఆపరేషన్ కగార్" ప్రజల హక్కులను తుంచే చర్య అని ఆరోపించారు.కాల్పుల విరమణ ప్రకటించి చర్చలకు దారితీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో %×ఖీఖ% రాష్ట్ర నేతలు ఎస్. వెంకటేశ్వరరావు, టి. శ్రీనివాస్, ఐ. కృష్ణ, సింగరేణి ప్రాంతానికి చెందిన జిఎల్‌బికేఎస్ రాష్ట్ర నేతలు ఈ నరేష్, శ్రీ సీతారామయ్య, ఐ. రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓదెల మల్లికార్జున స్వామి దేవస్థానం ఈవోకు కమిషనర్ నోటీసులు...




**ఓదెల,పెద్దపల్లి(ఆకాంక్ష న్యూస్) :** పెద్దపల్లి జిల్లా ఓదెలలోని ప్రముఖ దైవ పుణ్యక్షేత్రమైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు సమాచార హక్కు చట్టంలోని విభాగాల మేరకు తెలంగాణ సమాచార కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 23న హైదరాబాదులో కమిషన్ ముందు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే, ఓదెల మండల కేంద్రానికి చెందిన నాగపురి రవి అనే వ్యక్తి 2020 డిసెంబర్ 23 నుండి 2021 అక్టోబర్ 21 వరకు ఓదెలలో ఉన్న చీకటి ఆంజనేయస్వామి దేవాలయం, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం, రామచంద్ర స్వామి ఆలయాలకు సంబంధించిన భూముల వివరాలు, వాటి విస్తీర్ణం, పాస్‌బుక్‌లు, అలాగే ఈ దేవాలయాలలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగుల వివరాలు, వారికి చెల్లిస్తున్న జీతభత్యాలు వంటి అంశాలపై సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరారు. అయితే ఆలయ ఈవో ఈ సమాచారాన్ని అందించడంలో విఫలమయ్యారు. ఆపై నాగపురి రవి అసిస్టెంట్ కమిషనర్ (ఎఈసీ), కరీంనగర్ మరియు డిప్యూటీ కమిషనర్, వరంగల్ అధికారులకు కూడా సమాచార అభ్యర్థనను పంపినప్పటికీ, అక్కడి నుంచి కూడా తగిన సమాచారం రాలేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సమాచార కమిషనర్ కార్యాలయం ఈ వ్యవహారాన్ని పరిశీలించి, ఆలయ ఈవో ప్రవర్తన సమాచార హక్కు చట్టానికి విరుద్ధమని భావించి ఈనెల 23న కమిషన్ విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై స్థానికంగా చర్చ నడుస్తోంది. ప్రజాధనం ఆధారంగా నడిచే ఆలయాల పరిపాలనలో పారదర్శకత ఉండాలని ప్రజలు ఆశిస్తున్నారని, ఇటువంటి వ్యవహారాలు బాధ్యతారాహిత్యాన్ని నిశ్చితంగా సూచిస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక దేవస్థానం అధికారుల వైఖరిపై కమిషనర్ ముందు విచారణ అనంతరం మరిన్ని చర్యలు ఉండే అవకాశముందని న్యాయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఎనిమిది వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన పంచాయతీ కార్యదర్శి..



**ఆకాంక్ష :** పట్లోళ్ల నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, బుధేరా గ్రామ పంచాయతీ, మునిపల్లి మండలం, సంగారెడ్డి జిల్లా "వాటర్ సర్వీసింగ్ సెంటర్ షెడ్‌ను ఏర్పాటు చేయడానికి మరియు ఫిర్యాదుదారుడి ఓపెన్ ప్లాట్‌కు కొత్త ఇంటి నంబర్‌ను కేటాయించడానికి అనుమతి ఇచ్చినందుకు" ఫిర్యాదుదారుడి నుండి రూ. 8,000/- లంచం డిమాండ్ చేసి స్వీకరించినప్పుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## సంకల్ప సభను విజయవంతం చేయాలి



**ఆకాంక్ష :** శాయంపేట మండలంలోని మైలారం గ్రామంలో గురువారం నాడు 19-06-2025 రోజున ఉదయం 10 గంటలకు వికసిత్ భారత్ యొక్క అమృతకాల సేవా సుపరిపాలన %-% పేదల సంక్షేమానికి 11సంవత్సరాల మోడీ గారి ప్రభుత్వం గడచిన సందర్భంగా లిసంకల్ప సభ నిర్వహించడం జరుగుతుందని బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ తెలిపారు ఈ సందర్భంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ గారి నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు భారతదేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతున్న తరుణంలో, "వికసిత్ భారత్ ఏ2047" లక్ష్యంతో దేశవ్యాప్తంగా అమృతకాల సేవా సుపరిపాలన సంకల్ప సభ విజయవంతం కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలలో భాగంగా, గత 11 సంవత్సరాలలో పేదల సంక్షేమం, పారదర్శక పాలన, సంక్షేమ పథకాల సమర్థ అమలుపై కేంద్ర ప్రభుత్వం చేసిన కృషిని ప్రజల మద్దతుతో మరింత బలపరచడానికి ఈ "సంకల్ప సభ" నిర్వహించబడుతుంది కావున మండలంలోని రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, మండల పతాధికారులు, సీనియర్ నాయకులు పార్టీ శ్రేయోభిలాషులు మరియు మండలంలోని పుర ప్రముఖులు అందరూ హాజరై ఈ యొక్క సంకల్ప సభను విజయవంతం చేయవలసిందిగా కోరారు

## ములుగు జిల్లా డీఈఓ కార్యాలయంలో ఏసీబీ దాడులు: లంచం తీసుకుంటూ డీఈఓ పాణిని, సీనియర్ అసిస్టెంట్ రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్




**ఆకాంక్ష :** ములుగు జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈఓ) కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించి, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, ఒక సీనియర్ అసిస్టెంట్‌ను రూ.20,000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కన్నాయిగూడెం మండలం లక్ష్మీపురంలో పనిచేసే ఒక ఉపాధ్యాయుడు సిక్ లీవ్ పూర్తి చేసుకుని మళ్లీ పోస్టింగ్ కోసం జాయినింగ్ ఆర్డర్ కోరగా, ఈ అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధిత ఉపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రహస్యంగా ఆపరేషన్ చేపట్టి, డీఈఓ పాణిని, సీనియర్ అసిస్టెంట్‌ను లంచం తీసుకుంటుండగా అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌ను ములుగు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో నిర్వహించారు. ప్రస్తుతం ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ ఘటన జిల్లా విద్యాశాఖలో కలకలం రేపింది. లంచం వ్యవహారాలు వెలుగులోకి రావడంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ అధికారులు ఈ కేసుపై మరింత లోతైన దర్యాప్తు చేస్తున్నారు

# సినీ నటి రమ్యశ్రీపై కత్తి దాడి



**హైదరాబాద్(, ఆకాంక్ష న్యూస్) :** సినీ నటి, ప్రముఖ సినీ నిర్మాత రమ్యశ్రీపై మంగళవారం ఉదయం దుండగులు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లాలోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే%ా% గచ్చిబౌలి సమీపంలోని ఎఫ్‌సీఐ కాలనీ లేఅవుట్‌లో రోడ్డు హైడ్రా మార్కింగ్ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హైడ్రా అధికారులు లేఅవుట్ రోడ్లను ప్లాట్ యజమానుల సమక్షంలో సర్వే చేసి మార్కింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో సినీ నటి రమ్యశ్రీ కూడా తన సోదరుడితో కలిసి అక్కడికి వచ్చారు. అక్కడ జరుగుతున్న ప్రక్రియను వీడియో తీస్తుండగా, సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావుకు అనుచరులుగా ఉన్న కొందరు వ్యక్తులుగా వారిపై దాడికి దిగారు. వీడియో తీస్తున్నందుకు అభ్యంతరం చెబుతూ మొదట వాగ్వాదానికి దిగిన వారు, అనంతరం కత్తులతో రమ్యశ్రీ మరియు ఆమె సోదరుడిపై దాడికి ప్రయత్నించినట్లు సమాచారం. ఈ దాడిలో వారికి స్వల్ప గాయాలు అయ్యాయని తెలుస్తోంది. సంఘటనపై రమ్యశ్రీ స్పందిస్తూ %-% "ఇది పూర్తిగా పన్నుగడ్డ దాడి. మనకు లీగల్‌గా ఉన్న హక్కులను ఉపయోగించుకుంటే దాడులకు దిగుతున్నారంటే ఇది ఎంత దారుణమో చెప్పలేం. భూకబ్జా గుట్టును బయటపెట్టాలన్న ప్రయత్నమే ఇలాంటి చర్యలకు దారితీస్తోంది," అని పేర్కొన్నారు. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హైడ్రా మార్కింగ్ సమయంలో ఉన్మాదంగా ప్రవర్తించిన దుండగులపై తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. సంఘటనకు సంబంధించిన వీడియోలు, సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల గుర్తింపు మరియు అరెస్టు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. స్థానికులు ఘటనను తీవ్రంగా ఖండించారు. గచ్చిబౌలిలో ఇలా నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్న పనులకు ఆటంకం కలిగించడమే కాకుండా ఓ మహిళపై కత్తులతో దాడికి దిగడాన్ని తీవ్రంగా ఎత్తిపొడుస్తున్నారు. ఫిల్మ్ ఇండస్ట్రీలో కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. దర్యాప్తులో కీలకంగా మారనున్న హైడ్రా మ్యాపింగ్ వీడియోలు ఈ దాడి వెనుక భూ వివాదాలు, ఫోర్జరీ డాక్యుమెంట్ల వ్యవహారాలు ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా సర్వే ప్రక్రియను వీడియో తీసిన కారణంగానే దాడి జరిగిందన్న అనుమానాలు గాఢంగా ఉన్నాయి. దాంతోపాటు ఈ ఘటనలో ప్రభుత్వ అధికారుల రక్షణ లభించకపోవడం పట్ల పలువురు ప్లాట్ ఓనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తి రక్షణ కల్పించాలని రమ్యశ్రీ డిమాండ్ స్వతంత్రంగా ఉన్న భూములపై హక్కులు వినియోగించుకుంటున్న తమపై దాడి జరిగినందున, భద్రత కల్పించాలని రమ్యశ్రీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. "ఇది నాకొద్దికాదు, సామాన్య ప్రజానికానికి ముందున్న ప్రమాదం. గో%శీఅఝు-స్త్రఱతీఱ%కి, దూకుడుకు చట్టం గట్టి గుణపాఠం చెప్పాలి," అంటూ ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై సినీ, రాజకీయ రంగాల నుండి స్పందనలు రావాల్సిన నేపథ్యంలో, సమాజంలో భద్రతపై మరోసారి చర్చ మొదలైంది.

# మొదలైన ఆయిల్ ఫామ్ హార్వెస్టింగ్...!

- రైతు మోములో చిరునవ్వు...!
- 30 ఏళ్ళ పాటు రైతుకు నికర ఆదాయం...
- గణపురం మండలంలో ఇప్పటికే 300 ఎకరాలల్లో అయిల్ ఫామ్ సాగు...
- టన్ను ఆయిల్ ఫామ్ ధర రూ.18748/-...
- సంవత్సరానికి రూ.1,20,000/- నుండిరూ.1,50,000/- నికర ఆదాయం...
- బ్యాంకర్స్ మరియు రైతులతో త్వరలోనే సమావేశం నిర్వహిస్తాం..
- సెవెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఎండీ గండ్ర గౌతమ్ రెడ్డి.

**కొండాపురం గ్రామం, గణపురం మండలం :** రైతులకు 30 ఏండ్ల పాటు నికర ఆదాయం ఇచ్చే పంట ఆయిల్ ఫామ్ అని రైతులందరూ వరి మిర్చి పంటలకు ప్రత్యమ్నాయ పంటగా ఆయిల్ ఫామ్ సాగు చేయాలని కోరిన సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఎం.డీ గండ్ర గౌతమ్ రెడ్డి. గణపురం మండలం కొండాపూర్ గ్రామంలో రైతు అశోక్ రెడ్డి ఆయిల్ ఫామ్ తోటను పరిశీలించి,రైతులకు ఆయిల్ ఫామ్ సాగు యొక్క అవశ్యకతను వివరించారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....**

భారత దేశంలో ప్రతి ఒక్కరూ స్వీకరించే ఆహార పదార్థాల్లో ఎక్కువ ఆయిల్ ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ఆయిల్ ఫామ్ పంటను ప్రత్యామ్నాయ పంటగా సాగు చేయాలని రైతులకు సూచించినప్పుడు మా నాన్నగారు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు రైతులకు ఒక్క మంచి ఆదాయ వనరుగా ఉన్న ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన కల్పించేందుకు రైతులను అశ్వారావుపేట లోనీ ఆయిల్ ఫామ్ తోటల వద్దకు తీసుకెళ్ళి అక్కడి రైతులతో మాట్లాడించి మరియు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పరిశీలించే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఆ తరువాత రైతులు చాలా మంది ఆయిల్ ఫామ్ సాగు పై మొగ్గు చూపడం జరిగింది. గణపురం మండలంలో ఇప్పటికే 120 మంది రైతులు 300 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగును చేపట్టడం జరిగింది. ఈ రోజు కొండాపూర్ గ్రామంలోని మాజీ ఎంపీటీసీ అశోక్ రెడ్డి గారు 24 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 9 ఎకరాల్లో 6 టన్నుల ఆయిల్ ఫామ్ దిగుబడి రావడం జరిగింది .ఇది ప్రతి నెల ఒక్క ఉద్యోగికి నెల జీతం వచ్చినట్లు రైతులకు ప్రతి నెల నికర ఆదాయం దాదాపు 30 ఏండ్ల వరకు ఉంటుందని తెలిపారు. రైతులు చాలా మంది అశోక్ రెడ్డి , రమణాకర్ గార్లను చూసి ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ఆసక్తి చూపించడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేశారు. ఆయిల్ ఫామ్ సాగుపై ఉన్న అనుమానాలు ఇప్పటికే చాలా మంది రైతులకు తొలగిపోయాయి. అదే విధంగా రైతులు అడవి పందుల తో ఇబ్బంది ఉందని, చుట్టు పెన్సింగ్ వేయడానికి సబ్సిడీ వచ్చేలా చేయమని మా దృష్టికి తీసుకురావడం జరిగింది. ఇట్టి విషయంపై ఇప్పటికే బ్యాంకు అధికారులతో మాట్లాడటం జరిగింది 15 రోజుల్లో బ్యాంకు వాళ్ళతో,రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని, బ్యాంకు లోన్ వచ్చేలా చూస్తామని తెలిపారు. అనంతరం రైతులు గౌతమ్ రెడ్డి గారిని రైతులు శాలువా కప్పి సత్కరించారు.





## పాలస్తీనాలో శాశ్వత శాంతి కొరకు ఇజ్రాయిల్ ఆక్రమించిన పాలస్తీనా భూభాగాల పై నుండి వెంటనే వైదొలగాలి:నేదునూరి రాజమౌళి




**హనుమకొండ:** ప్రపంచంలో సామ్రాజ్యవాదం వెనుకబడిన దేశాలను కబళించాలని పన్నాగంలో భాగంగా ఇజ్రాయిల్ పాలస్తీనాను ఆక్రమించుకోవడానికి తీవ్రంగా యుద్ధ ప్రయత్నాలు చేయడం అంతర్జాతీయ యుద్ధం నేరమని వెంటనే పాలస్తీనా ప్రాంతం నుంచి ఇజ్రాయిల్ సైన్యాలు ఆక్రమించిన భూభాగాలను వదిలి వెళ్లాలని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి నేదునూరి రాజమౌళి డిమాండ్ చేసినారు. హనుమకొండలో అంబేద్కర్ సర్కిల్ నందు పాలస్తీనా సంఘీభావ దినంగా పాటిస్తూ ప్రదర్శన చేయడం జరిగింది, సమావేశంలో నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ న్యాయము శాంతి మానవత్వం ప్రపంచంలో వర్ధిల్లాలని ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్షిప్ ఇండియాలో పనిచేస్తుందని తెలిపారు 20 నెలలుగా పాలస్తీనాలో 55 వేల మందిని ఇజ్రాయిల్ సైన్యం చంపడాన్ని తీవ్రంగా ఖండించారు జాతుల సమస్య ప్రాంతాల సమస్య అను యుద్ధాలకు దారి తీయకుండా చర్చల ద్వారా పరిష్కరింపబడాలని అందుకు భారతదేశం ముందుకు రావాలని తెలిపారు సంఘీభావ ఉద్యమాలు శాంతి ఉద్యమాలు యుద్ధోన్మాదాన్ని నిరోధించగలరని పేర్కొన్నారు ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్యలఎల్లేష్,నవ చేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు ఎర్ర కుమారస్వామి జర్నలిస్ట్ యూనియన్ తోట సుధాకర్ రాజు వెంకటేష్ ప్రవీణ్ కుమార్ మోడెం రాజేందర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## పెంబర్తి లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ను పరిశీలించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**తెలంగాణ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ను హాసన్ పర్తి మండలం, పెంబర్తి గ్రామంలో అకస్మాత్తుగా హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్ స్నేహ శబరేష్ సందర్శించి పరిశీలించినారు, 22 మంది ముగ్గులు పోసుకున్నారు,14గురు బేస్మిట్ 7 రూఫ్ లేవల్ 2స్లాబ్ వరకు నిర్మాణం చేసుకున్నారు లబ్ధిదారులకు వారి నిర్మాణం స్థాయిని బట్టి లబ్దిదారుల అకౌంట్లో డబ్బులు జమ అవుతవి అని అన్నారు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకునే లబ్ధిదారులు సూర స్వరూప,రజిత,తాల్లపెళ్ళి అరుణ,కోతి సులోచన, సౌరం రాజేశ్వరి,సమ్మమ్మ, కోయ్యాడ మంజుల తో మాట్లాడి నిర్మాణం గురించి ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా, ఎన్ని రోజులలో నిర్మాణం చేస్తారు అని తెలుసుకున్నారు, మంజూరి అయినవారు త్వరలో నిర్మాణం చేసుకొవాలి అని అన్నార ఈ కార్యక్రమంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ధరావత్ రవీందర్ నాయక్,డి ఇ సిద్దార్థ నాయక్,హాసన్ పర్తి మండల డిప్యూటి తహసీల్దార్ ఎం డి రహీమ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫాజిల్,మండల అభవృద్ధి అధికారి కట్ల కరుణాకర్ రెడ్డి గ ,హౌజింగ్ ఏఇ చేగొండ సరిత, ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు చైర్మన్ నాగవల్లి శ్రీనివాస్ (ప్రత్యేక అధికారి) కమిటి సభ్యులు జోరుక పూల,తాళ్లపెల్లి రమాదేవి- రమేష్,గోపాల్,పంచాయతీ కార్యదర్శి),కారోబార్ చాతల్ల సదానందం,యూత్ నాయకులు సౌరం చరణ్ ఇందిరమ్మ ఇండ్ల, లబ్దిదారులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు..

# తెలంగాణ పల్లెలకు మహర్దశ.. ఊహించనంత అభివృద్ధి, భూముల ధరలకు రెక్కలు

- గ్రామీణ రోడ్లకు నవశకం
- 'హ్యామ్' విధానంపై మార్గదర్శకాలు విడుదల
- త్వరలోనే పనులు ప్రారంభం



**తెలంగాణ :** తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు మహర్దశ పట్టనుంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంపై రెండు రోజుల్లో మార్గదర్శకాలు జారీ చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. ఈ విధానంలో 18,472 కి.మీ. రోడ్ల అభివృద్ధి చేయాలని, తొలి విడతలో 7,947 కి.మీ. రోడ్లకు 15 రోజుల్లో టెండర్లు వేయాలని ఆదేశించారు. అలాగే 93 వేల మంది గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్‌ఛానెల్ ద్వారా జీతాలు, పెండింగ్ బిల్లులు త్వరలో విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ పల్లెలకు మహర్దశ పట్టనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కీలకమైన అడుగులు పడుతున్నాయి. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంపై రెండు రోజుల్లో మార్గదర్శకాలను జారీ చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల అనుభవాలను సమగ్రంగా అధ్యయనం చేసి తెలంగాణలో ఈ 'హ్యామ్' విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఆమె స్పష్టం చేశారు. 'హ్యామ్' రోడ్ల నిర్మాణం, ఇందిరా మహిళాశక్తి, స్త్రీ నిధి, మిషన్ భగీరథ, ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై అధికారులతో మంగళవారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. 'హ్యామ్' విధానం ద్వారా గ్రామీణ రోడ్లకు మహర్దశ పడుతుందని, ప్రతి పల్లెలో రోడ్లు అందుబాటులోకి వస్తాయని మంత్రి స్పష్టం చేశారు. మొత్తం 18,472 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతలో 7,947 కిలోమీటర్ల మేర రోడ్లను నవీకరించాలని ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఈ పనులకు సంబంధించి 15 రోజుల్లో టెండర్లు వేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. కాగా, పల్లెల్లో రహదారుల నిర్మాణంతో గ్రామాల రూపురేఖలు మారిపోనున్నాయి. స్థానికంగా భూములకు రెక్కలు రానున్నాయి.

### ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం..

ఇక తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యలను ఎన్నో పరిష్కరించామని మంత్రి సీతక్క గుర్తుచేశారు. 93 వేల మంది గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్‌ఛానెల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీడీవోల బదిలీల దస్త్రం ముఖ్యమంత్రి వద్ద, వారి వాహనాల అద్దెభత్యం ఫైల్ ఆర్థికశాఖ వద్ద ఉన్నాయని, త్వరలోనే వీటికి అనుమతులు వస్తాయని ఆమె హామీ ఇచ్చారు. ఈ ఏడాది ప్రతి మండలానికి 2 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1,440 గ్రామ పంచాయతీ భవనాలను, 1,440 అంగన్‌వాడీ భవనాలను నిర్మిస్తామని వెల్లడించారు. మరోవైపు పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను త్వరలో విడుదల చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్డు సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థల అభివృద్ధికి కూడా 'హ్యామ్' విధానం దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణకు వర్ష సూచన..ఈ జిల్లాల్లో జోరుగా వానలు



- తెలంగాణకు రెయిన్ అలర్ట్
- నాలుగు రోజుల పాటు వర్షాలు
- హెచ్చరికలు జారీ

**తెలంగాణ :** తెలంగాణలో నేటి నుంచి నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు యాక్టివ్ కావటం, ఆవర్తనం కారణంగా.. పలు జిల్లాల్లో వానలకు ఛాన్స్ ఉందన్నారు. గంటకు 30-40 కి.మీ. వేగంతో బలమైన ఈదురు గాలులు కూడా వీస్తాయని చెప్పారు. హైదరాబాద్‌లో సాయంత్రం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. తెలంగాణకు హైదరాబాద్ వాతావరణ శాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలో నేటి నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని చెప్పారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో విస్తారంగా వర్షాలు కురువనున్నాయని వెల్లడించింది. నేడు ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట,జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలకు ఛాన్స్ ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రుతుపవనాలతో తోడు దక్షిణ ఒడిశా వద్ద ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల్లోనూ మేఘావృతమైన వాతావరణం ఉంటుందని అధికారులు తెలిపారు. నగరంలో సాయంత్రం తర్వాత వర్షం కురిసే ఛాన్స్ ఉన్నట్లు పేర్కొన్నారు.

### ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు..

గతేడాది (2024) రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వర్షాల విరామ కాలాలు ఎక్కువగా నమోదవడం వల్ల వ్యవసాయానికి ఇబ్బందులు తలెత్తాయని వాతావరణ నిపుణులు వెల్లడించారు. దీనివల్ల ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. అయితే ఈసారి అలాంటి పరిస్థితి ఉండదని భారత వాతావరణ శాఖ (%×వీణ%) అంచనా వేసింది. ఈ సంవత్సరం తెలంగాణలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని %×వీణ% అంచనా వేస్తోంది. ముఖ్యంగా జూన్ 20 -26 వరకు తెలంగాణలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచిస్తోంది. ముఖ్యంగా ఉరుములు, మెరుపుల సమయంలో ఆరు బయట ఉండకుండా సురక్షిత ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలని చెబుతున్నారు. ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# ఉపాధి కూలీలకు కొత్త పనులు.. వాటి కోసం రూ.1800 కోట్లు.. ఇక నివాస ప్రాంతాల్లోనే..



**తెలంగాణ :** తెలంగాణలో మంత్రి సీతక్క ఉపాధి హామీ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. రూ. 1,800 కోట్లతో పనులు మంజూరు అయ్యాయి. అంగన్‌వాడీలు, గ్రామ పంచాయతీ భవనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ ఏడాది 1440 పంచాయతీ కార్యాలయాలు, 1400 అంగన్‌వాడీల నిర్మాణం జరుగుతుంది. నెలవారీ లక్ష్యాలు నిర్దేశించుకొని పనులు చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవోల బదిలీలు, వాహనాల అలవెన్స్‌ల ఫైళ్లకు రెండు రోజుల్లో క్లియరెన్స్ వస్తుంది. ఇతర రాష్ట్రాల విధానాలు అధ్యయనం చేయనున్నారు. 15 రోజుల్లో టెండర్లు వేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ జీవనోపాధికి నూతన ఊపునిస్తూ.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (%వీ+చీ=జు+రూ%) పనులు త్వరలో వేగం పుంజుకోనున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక పథకం కింద రూ.1,800 కోట్ల విలువైన పనులను ప్రభుత్వం ఆమోదించిందని.. ఈసారి అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసం, స్థానిక పాలనను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తుంది. మంత్రి సీతక్క తన పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, వివిధ పెండింగ్ అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి మండలానికి రెండు చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1440 పంచాయతీ కార్యాలయాల భవనాలను, అదనంగా 1400 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మౌలిక వసతుల కల్పన గ్రామీణ ప్రాంతాల్లో పారదర్శక పాలనను మెరుగుపరుస్తుంది. పౌరులకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తుంది. అంతేకాకుండా.. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, గర్భిణులకు ఆరోగ్య సేవలు మెరుగ్గా అందుతాయి. ఆర్థిక ప్రణాళిక, అమలులో పారదర్శకతను పెంచేందుకు.. నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకొని పనులను పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎంపీడీవోల బదిలీలు, వాహనాల అలవెన్స్‌లకు సంబంధించిన పెండింగ్ దస్త్రాలకు రెండు రోజుల్లోనే అనుమతులు లభిస్తాయని ఆమె హామీ ఇచ్చారు. పనుల నాణ్యత, సమర్థవంతమైన అమలు కోసం.. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడానికి అధికారుల బృందాలను పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఇది నూతన పద్ధతులను తెలుసుకొని.. తెలంగాణలో అమలు చేయడానికి దోహదపడుతుంది. భవనాల నిర్మాణానికి సంబంధించి 15 రోజుల్లోగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించేలా కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, డైరెక్టర్ సృజనతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి, పేదరిక నిర్మూలనకు ఉపాధి హామీ పథకాన్ని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ పనుల ద్వారా గ్రామీణ నిరుద్యోగులకు నేరుగా ఉపాధి లభించడంతో పాటు, స్థానికంగా శాశ్వత ఆస్తుల నిర్మాణం జరుగుతుంది, ఇది సుస్థిరాభివృద్ధికి పునాది వేస్తుంది.






**ఆకాంక్ష :** హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మాందారి పేట స్టేజి వద్ద శాయంపేట సిఐ రంజిత్ రావు ఆదేశాల మేరకు ఏఎస్ఐ కుమారస్వామి, ట్రైనింగ్ ఎస్సైలు హేమలత, స్వాతి వాహనాల తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని తల్లిదండ్రులకు సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని సీట్ బెల్ట్ ధరించాలని పేర్కొన్నారు ఈ వాహనాల తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ మెంబర్ ప్రో గాదె దయాకర్ గారు



**ఆకాంక్ష :** మంగళవారం పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారిని హనుమకొండ భవాని నగర్ లోని వారి నివాసంలో ఇటీవలే నూతనంగా నియమితులైన తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ అప్పిలేట్ అథారిటీ మెంబర్ ప్రో గాదె దయాకర్ గారు మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం పూల బొకే అందజేసి,శాలువా కప్పి సన్మానించారు.తన నియామకానికి సహకరించినందుకు ఎమ్మెల్యే గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని,పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లేలా చూస్తానని చెప్పారు.

# పోలీస్ అధికారులకు మెమోలు జారీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్


MEMO
Commissioner of Police Warangal


**ఆకాంక్ష :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ అధికారుల తీరుపై సీరియస్ గా స్పందించారు. ఎలాంటి పదవి లేని మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నాయకుడు ప్రస్తుత మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీకి ఎస్కార్ట్ కల్పించిన మట్టేవాడ ఏసిపి నందిరాం నాయక్, సీఐ సుకుమార్ తో పాటు, మరో ఇద్దరు అధికారులకు మంగళవారం మెమోలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కొండా మురళికి ఎస్కార్ట్ కల్పించినందుకే సీరియస్ గా పోలీస్ కమిషనర్ తీసుకున్నట్లు తెలుస్తుంది. పలు మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలు, ప్రతిపక్షాలు, సామాన్య జనాలు, ముఖ్యంగా నేటిజెన్ల నుంచి కూడా తీవ్ర విమర్శలు వ్యక్తం అవడంతో, దీనిపై ప్రభుత్వం సీరియస్ గా స్పందించినట్లు సమాచారం. అందులో భాగంగానే పోలీస్ కమిషనర్ వరంగల్ డివిజన్ పోలీస్ అధికారులకు మెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మీపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలంటూ, మేములో అధికారులను వివరణ కోరారు. ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం పోలీస్ అధికారులు కొండా మురళిని ఎస్కార్ట్ వాహనంలో తీసుకెళ్తున్న వీడియోలు సామాజిక మద్యమాల్లో చెక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే! దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు కూడా వచ్చాయి. ఈ విషయం ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లడం ప్రతిపక్షాలు, సామాన్య జనాలు ముఖ్యంగా నటిజెన్ల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో, ప్రభుత్వం సీరియస్ గా స్పందించినట్లు సమాచారం. అందులో భాగంగానే సిపి వరంగల్ డివిజన్ పోలీస్ అధికారులకు మెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత అధికారులకు వేటుపడడం ఖాయంగా కనిపిస్తుందని విశ్వసనీయ సమాచారం.

# ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని వెనకబడనివ్వం.. అభివృద్ధిని ఆగనివ్వం..



**భూపాలపల్లి, 17 జూన్ 2025:** ప్రజా ప్రభుత్వంలో సంక్షేమాన్ని వెనకబడనివ్వం.. అభివృద్ధిని ఆగనివ్వమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు మంగళవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేతుల మీదుగా కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 140 లక్షలతో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం మొరంచపల్లి నుండి మంజూరునగర్ వరకు వరకు సాగిన పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించగా, ఈ ర్యాలీలో అతిథులు ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం మంజూరునగర్లో నవాబుపేట, ధర్మారావుపేట, మంజూరునగర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు చేశారు.

# ఏసీబీ అధికారుల వలలో అవినీతి చేప చిక్కింది



**ఆకాంక్ష :** మార్కాపురం ఇరిగేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఒక కాంట్రాక్టర్ నుండి 30 వేల రూపాయిలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ ఒంగోలు డీఎస్పీ ఎస్ శిరీష మీడియాకు వివరించారు. శ్రీనివాసరెడ్డి అనే కాంట్రాక్టర్ మూడు అభివృద్ధి పనులు చేశారు. పెండింగ్ బిల్లులు అప్రూవల్ చేసేందుకు సీనియర్ అసిస్టెంట్ 30 వేల రూపాయలు డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడానికి ఇష్టపడని కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దాంతో కాంట్రాక్టర్ నుండి 30 వేల రూపాయల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పథకం ప్రకారం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావును ఏసీబీ డిఎస్పీ శిరీష వలపన్ని పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్స్పెక్టర్లు రమేష్ బాబు, శేషు,సబ్-ఇన్స్పెక్టర్లు ప్రసాద్, మస్తాన్ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు..